# సూర్య

కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం,7 ఫిబ్రవరి 2024



## ఆసరాతో మహిళలకు ఆర్థిక పరిపుష్టి..

**– మాజీ ఎమ్మెల్యే వరుపుల..**



**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** వైకాపా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టి ఆసరా ద్వారా మహిళలకు ఆర్థిక పరిపుష్టి కలిగించారని ప్రత్తిపాడు నియోజకవర్గ వైకాపా ఇన్చార్జి వరుపుల సుబ్బారావు వెల్లడించారు. మంగళవారం ఏలేశ్వరం నగర పంచాయతీ పరిధిలో బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నగర్ చైర్ పర్సన్ అలమండ సత్యవతి చలమయ్య అధ్యక్షతన ఆసరా చెక్కులు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వరుపులు మాట్లాడుతూ ద్వాక్రా మహిళలు మరింత ఆర్థిక పరిపుష్టి కలిగించేందుకు ముఖ్యమంత్రి జగన్ అనేక పథకాలను అమలు చేస్తున్నారని దీనిలో భాగంగా ఆసరా కార్యక్రమం చేపట్టారున్నారు. ప్రధానంగా ఏలేశ్వరం నగర పంచాయతీ పరిధిలో 516 డ్వాక్రా సంఘాలలో 5100 సభ్యులకు సుమారు 4.45 కోట్ల మేర ఆసరా సొమ్ము అందించడం జరిగిందన్నారు. వైకాపా అధికారం చేపట్టి ఈ నాలుగేళ్లలో డ్వాక్రా మహిళలకు 4 విడతలుగా అందించడం జరిగిందన్నారు. దీనిని మహిళలు సద్వినియోగం చేసుకుని తమ కుటుంబాలకు బాసటగా నిలవాలని ఆయన సూచించారు. నగర పంచాయతీ వైస్ చైర్మన్ శిడగం త్రివేణి వెంకటేశ్వరావు, మసిరపు బుజ్జి , సామంతుల సూర్య కుమార్ తొండారపు రాంబాబు, డ్వాక్రా మహిళలు, నగర పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# అన్నదమ్ముల పోరులో ..
# బరిలో నిలిచేది ఎవరు ?

**-అభ్యర్థి ఎంపికపై టిడిపి జనసేన కార్యకర్తల్లో నెలకొన్న ఉత్కంఠ..**

**కొత్తపేట, మేజర్న్యూస్ :** టిడిపి, జనసేన పొత్తుల కలయికతో కొత్తపేట నియోజకవర్గంలో రాజకీయం రసవత్తరంగా మారుతోంది. టిడిపి, జనసేన ఇన్చార్జిలుగా సొంత అన్నదమ్ములు కావడంతో ఉత్కంఠ నెలకొంది. సీటు మాదే అంటూ మాదే అని ఎవరి ధీమా వారు వ్యక్తం చేస్తూ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. దాంతో ఇరు పార్టీల కార్యకర్తల్లో గందరగోళ పరిస్థితి ఏర్పడింది.సందట్లో సడేమియా అంటూ ఇరువురి ప్రత్యర్థి వర్గమైన స్థానిక ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఎన్నికల కసరత్తులు చేసుకుంటూ ప్రచారంలో ముందుకు దూసుకుపోతున్నారు. అయినప్పటికీ ఇరువురు వారివారి పార్టీలో బలంగానే ఉన్నారు.సీనియర్ నాయకుడైన టిడిపి ఇన్చార్జ్ బండారు సత్యానందరావు ఆయకున్న మంచితనం, స్నేహస్వభావంతో ప్రజల్లో చెరగని ముద్ర వేసుకున్నారు.

ఈయన వరుసగా పోటీల్లో నిలుస్తున్నప్పటకీ నియోజవర్గంలోనీ కొన్ని గ్రామాలలో క్యాడర్ తో బలంగా ఉండగా అదే క్యాడర్ పై కొన్ని గ్రామాలలో వ్యతిరేకత కూడా ఉంది.సొంత సామాజిక వర్గం కలిసి రాక 2014,2019 జరిగిన ఎన్నికల్లో వరుసగా స్వల్ప ఓట్ల తేడాతో రెండుసార్లు ఓటమి చెందారు.టిడిపి జనసేన కలయిక,అదే విధంగా సానుభూతి కూడ తోడు అవ్వడంతో ఈసారి తప్పకుండా విజయం సాధిస్తామని ధీమాతో ఉన్నారు.2019 ఎన్నికల్లో ఓటమి చెందిన తర్వాత తమ కార్యకర్తలను పట్టించుకున్న దాఖలు లేవని విమర్శిస్తున్నారు.నియోజకవర్గంలో టిడిపి వరస ఓటములతో కార్యకర్తలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఐదు సంవత్సరాల పరిపాలన కాలంలో అధికార వైసిపి పార్టీ టిడిపి కార్యకర్తలను పలు రకాలుగా ఇబ్బందులకు గురిచేసిన సత్యానందరావు మెతక వైఖరి కారణంగా అధికార పార్టీనీ దీటుగా ఎదుర్కొనలేకపోయారనే ఆవేదన...ఇబ్బంది పడ్డ కార్యకర్తల్లో ఉంది.ఆవిషయాన్ని కూడా గ్రహించిన సత్యానందరావు దాన్ని సర్దుబాటు చేసుకుంటూగెలుపుదిశగాముందుకు సాగుతున్నారు. అలాగే జనసేన ఇన్చార్జ్ బండారు శ్రీనివాస్ జనసేన పార్టీ స్థాపించిన మొదటి నుండి పార్టీలో ఉంటూ బలోపేతం చేస్తూ తను కూడా నియోజకవర్గంలో బలమైన నాయకుడిగా ఎదిగారు.పవన్ కళ్యాణ్ పై అభిమానం తో సామాజికపరంగా కూడా మెజార్టీ వర్గం జనసేన వైపే ఉన్నట్లుగా తెలుస్తోంది.గత ఎన్నికలలో 35,833 వేల ఓట్లు జనసేన అభ్యర్థి బండారు శ్రీనివాస్ కు వచ్చాయి.ఓటమి చెందినప్పటికీ ఆ పార్టీ ఇచ్చిన ఆదేశాల మేరకుకార్యక్రమాలు చేస్తూ ప్రజల మధ్యనే ఉంటున్నారు.కరోనా విపత్కార సమయంలో పార్టీ తరఫున అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు.కేవలం యువతతో ప్రస్థానం మొదలుపెట్టి ఇరు పార్టీలనుండి అన్ని సామజిక వర్గాల నాయకులను చేర్చుకుని బలమైనటువంటి క్యాడర్ కూడా ఏర్పాటు చేసుకోవడంతో బండారు శ్రీనివాస్కు కలిసివచ్చేఅంశాలుగాకనిపిస్తున్నాయి.బండారు అన్నదమ్ముల బలబలాలు చూసుకున్నట్లయితే సీటు ఎవరికి దక్కిన విజయం వరిస్తుందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.అధికార పార్టీపై వ్యతిరేఖత టిడిపి,జనసేన పొత్తుల కలయిక నియోజకవర్గంలోని బలమైన సామాజిక వర్గంతో పాటు అన్ని సామాజిక వర్గాలు ఏకతాటిపైకి వచ్చే అంశాలు కనిపించడంతో ఇరువురికి విజయ అవకాశాలు కూడా ఎక్కువగానే కనిపిస్తున్నాయి.కుటుంబ కలహాల నేపథ్యంలో విబేధంగా ఉన్న అన్నదమ్ములు రాజకీయంగా పొత్తుల కలయికతో ఒకరికొకరు బహిర్గతంగా ఏకమయ్యారు.ఇద్దరిలో ఎవరికి సీటు వచ్చిన ఒకరికొకరు సహకరించుకుంటారా..?లేక అంతర్గతంగా వెన్నుపోటు రాజకీయాలకు తెర లేపుతారా?అనే ప్రశ్నలుకొంతమందిమదిలో తలెత్తుతున్నాయి. జనసేన అభ్యర్థికి సీటు కేటాయించినట్లయితే సునాయసంగా విజయ లభిస్తుందని అధికార పార్టీ నేత భావిస్తున్నారంటూ జోరుగా ప్రచారం సాగుతోంది.ఒకవేళ టిడిపికి కేటాయించినట్లయితే బండారు సత్యానందరావు పట్ల ఉన్న సానుభూతితో ఈసారి ఎన్నికలలో సత్యానందరావు గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు తెదేపా నేతలు భావిస్తున్నారు.అయితే దీనికి ధీటుగా జనసేన నేతలు కూడా శ్రీనివాస్ గెలుపు ఖాయమని ఢంకా మోగిస్తున్నారు.

నియోజకవర్గంలో వీటన్నిటికీ సమాధానం అభ్యర్థి ప్రకటించిన తర్వాత తేలనుంది.ఇరుపార్టీల్లో ఉన్న వ్యతిరేఖులు ఉమ్మడి అభ్యర్థికి మద్దతు ఇస్తే ఉమ్మడి అభ్యర్థి గెలిచే అవకాశాలు ఉంటాయని విశ్లేషకులు చెపుతున్నారు.ఏది ఏమైనప్పటికీ అభ్యర్థి ప్రకటన రాగానే కొత్తపేట లో కొత్త రాజకీయ సమీకరణాలు ఏర్పడనున్నాయి.

## పేద విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించడం కోసమే జగనన్న ట్యాబ్‌లు పంపిణీ

**– ఎంపీపీ వెంకటలక్ష్మి**



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** పేద విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించడం కోసమే జగనన్న క్యాబ్లు పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగిందని ఎంపీపీ గోము వెంకటలక్ష్మి అన్నారు.మండల కేంద్రమైన రాజవొమ్మంగి జిల్లా పరిషత్ హై స్కూల్ నందు ఎనిమిదో తరగతి చదువుతున్న 103 మంది విద్యార్థులకు ట్యాబ్లను ఎంపీపీ వెంకటలక్ష్మి పంపిణీ చేశారు. పాఠశాల కమిటీ చైర్మన్ చింతలపూడి వీరబాబు అధ్యక్షతన హెచ్ఎం గోపాలకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎంపీపీ గోము వెంకటలక్ష్మి ముఖ్యఅతిథిగా విచ్చేసి స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ట్యాబ్ లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమెమాట్లాడుతూ రాష్ట్రంలో జగనన్న అనేక ప్రజా సంక్షేమ పథకాలు పెట్టి అమలు చేయడం జరిగిందని వేద విద్యార్థులకు చదువు భారం కాకూడదని అమ్మ ఒడి, విద్యా దీవన, వసతి దీవెన తో పాటు 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆన్లైన్లో విద్యా బోధనకు ట్యాబ్ లు అందజేయడం జరుగుతుందన్నారు. విద్యార్థులు జగనన్న అందించినట్యాబ్ లను సద్వినియోగం చేసుకోవాలని సిహెచ్ సత్య చంద్ర రాణి,కనిగిరి వీరబాబు అన్నారు.ఎంఈఓ తాతబ్బాయి దొర, సిహెచ్ అప్పారావు, దుర్గాప్రసాద్, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

## కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించిన సీఐ సన్యాసినాయుడు



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** రాజవొమ్మంగి ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఏపీ ఆర్ జూనియర్ కళాశాలల విద్యార్థిని విద్యార్థులకు మంగళవారం ప్రేరణ, ఆన్లైన్ మోసాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, రోడ్ యాక్సిడెంట్ తదితర వాటిపై స్థానిక సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎన్ సన్యాసినాయుడు అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తుల నుండి ఆన్లైన్లో రుణం పొందడం ప్రాణ సంకటమని, మొబైల్ ద్వారా అలాంటి కాల్స్ వస్తే పోలీసులను సంప్రదించాలని, ఈ విషయం విద్యార్థులు తల్లిదండ్రులకు చుట్టుపక్కల వారికి తెలియపరచాలని, అలానే వాహనాలపై ప్రయాణించేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి విద్యార్థులకు వివరిం చారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అడిషనల్ ఎస్సై జాన్ కుమార్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలలో ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థి ప్రతిభ



**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థి పసుపులేటి మహాలక్ష్మి ఆడుదాం ఆంధ్రా బ్యాడ్మింటన్ జిల్లాస్థాయి పోటీలలో ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకాన్ని సాధించినట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీ జీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి ఈ వి ఎల్ నాయుడు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ క్రీడా విభాగం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర పోటీలలో ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థి రజత పతకాన్ని సాధించింది. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా జిల్లా స్థాయి మహిళల బ్యాడ్మింటన్ పోటీలు జిఎంసీ బాలయోగి స్టేడియంలో జనవరి 31 నుండి ఫిబ్రవరి 04 వరకు జరిగాయి. ఈ పోటీలలో ఆదిత్య డిగ్రీ కళాశాల బీకాం విద్యార్థి పసుపులేటి మహాలక్ష్మి జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకాన్ని సాధించింది. ఈ సందర్భంగా అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు మహాలక్ష్మిని అభినందించి మాట్లాడుతూ విద్యార్థుల చదువుతో పాటు అన్ని రంగాలలో రాణించాలని అన్నారు. మరిన్ని పోటీలలో పాల్గొని విజయాలు సాధించాలని అన్నారు. మహాలక్ష్మిని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, క్యాంపస్ ఇన్చార్జి మూర్తి, బి సి డి ఇ కోఆర్డినేటర్ టి తేజేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ పి ఓ ఎల్ దివాకర రావు, పి.డి ఉదయ భాస్కరరావు , తల్లిదండ్రులు శ్రీ పసుపులేటి మురళీకృష్ణ, శ్రీమతి వీర వేణి, అధ్యాపకులు మరియు విద్యార్థులు అభినందించారు.

## కార్యకర్తలందరూ సమిష్టిగా కృషిచేసి విజయకేతనాన్ని ఎగరవేయాలి -ఎమ్మెల్యే



**అనపర్తి, మేజర్ న్యూస్ :** రానున్న ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అందరూ సమిష్టిగా కృషిచేసి అనపర్తి నియోజకవర్గంలో తిరుగులేని మెజారిటీతో విజయ కేతనం ఎగరవేయాలని అనపర్తి ఎమ్మెల్యే డా సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. మంగళవారం అనపర్తి గ్రామ 1వ సచివాలయం పరిధిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే దంపతులు పాల్గొన్నారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మన పార్టీ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియపరిచే బాధ్యత కార్యకర్తలపై ఉందని, పార్టీ విజయానికి కార్యకర్తలే ప్రధాన పాత్ర పోషిస్తారని అన్నారు. వచ్చే ఎన్నికల దృష్ట్యా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. పార్టీలో కార్యకర్తలకు సముచిత స్థానం ఎప్పుడు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అనపర్తి సర్పంచ్ వారా కుమారి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి ( రాంబాబు), అనపర్తి టౌన్ ప్రెసిడెంట్ టి.మురళీమోహన్ బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వైకాపాను గద్దె దింపేందుకు ప్రజలు సిద్ధం



**కాకినాడ, మేజర్ న్యూస్ :** రాబోయే నలభైరోజుల తరువాత జరిగే ఎన్నికలలో ఈ ముఖ్యమంత్రిని, వై.ఎస్.ఆర్ పార్టీని దించేందుకు మేము సిద్ధం అని స్థానికులు అంటున్నారనీ, ఇక ఈ వై.సి.పి ప్రభుత్వం రోజులు లెక్కెట్టుకోడమే అని సిటి ఉపాధ్యక్షులు అడబాల సత్యనారాయణ అన్నారు. మంగళవారం కాకినాడ సిటిలో జనసేనపార్టీ పి.ఏ.సి సభ్యులు మరియు కాకినాడ సిటీ ఇంచార్జ్ ముత్తా శశిధర్ నాయకత్వంలో ఆకాశాన్ని అంటుతున్న ఆస్తిపన్నుపై యుద్ధానికి మేము సిద్ధం అనే కార్యక్రమం స్థానిక రామారావుపేట వివేకానంద పార్క్ ప్రాంతంలో సిటి ఉపాధ్యక్షులు అడబాల సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యక్షుడు అడబాల సత్యన్నారాయణ మాట్లాడుతూ లోగడ ఈ జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలు చేస్తున్న రోజులలో బాదుడే బాదుడు అని నినాదాలు ఇస్తుంటే అప్పటి ప్రభుత్వం వేస్తున్న పన్నుల మీద అని ప్రజలు భ్రమపడి ఈయనకి అధికారాన్ని కట్టబెట్టారనీ, తీరా అధికారంలోకి వచ్చాక ప్రజలకి క్రమంగా అర్ధమైందనీ ఆయన అన్నది రాబోయే రోజులలో తాను ప్రజలపై ఆస్తిపన్ను రూపంలో బాదుడే బాదుడు వాతలు అని అంటూ ఎద్దేవా చేశారు. ఈయన విదిల్చే మెతుకులు తిని బతకాలి తప్ప సొంత ఇళ్ళను పేదప్రజలు కట్టుకోకూడదనా ఇలా ఆస్తిపన్నులు ఆకాశాన్నంటేలా పెంచేసి పెంచేసి ప్రజల రక్తాన్ని పిండేస్తున్నారని ప్రశ్నించారు. రాబోయే నలభైరోజుల తరువాత జరిగే ఎన్నికలలో ఈ ముఖ్యమంత్రిని, వై.ఎస్.ఆర్ పార్టీని దించేందుకు మేము సిద్ధం అని స్థానికులు అంటున్నారనీ, ఇక ఈ వై.సి.పి ప్రభుత్వం రోజులు లెక్కెట్టుకోడమే అని అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాసిరెడ్డి శివ, జిల్లా సంయుక్త కార్యదర్శి బడే కృష్ణ, బావిరెడ్డి నిరంజన్ నాయుడు, నూకల బలరాం, యాళ్ల సత్యనారాయణ, దూడ బేబీ, సాక్షి సంతోషిలక్ష్మి, మిరియాల హైమావతి, దారపు శిరీష, మావులూరి రాగిణి, బండి సుజాత, చోడీపల్లి సత్యవతి, దీప్తి, బోడపాటి మరియా, సోనీ ఫ్లోరెన్స్, రమ్య, రచ్చ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# వరి పంట క్షేత్ర స్థాయిలో సందర్శించిన జర్మనీ సంస్థ సభ్యులు



**అంబాజీపేట, మేజర్ న్యూస్ :** జర్మన్ సంస్థ, ఐఆర్ఆర్ఐ ఇంటర్నేషనల్ వరి పరశోధనా స్థానం, గ్లోబల్ మార్కెటింగ్ వారి ప్రతినిధులు మంగళవారం అంబాజీపేట మండలం వక్కలంక గ్రామంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను మరియు రసాయనిక వరి పొలాలను సందర్శించారు. ఇందులో భాగంగా రసాయనిక పురుగుమందులతో వ్యవసాయం చేస్తున్న రైతులను మరియు ప్రకృతి వ్యవసాయ రైతులతో మాట్లాడారు. కెమికల్ వ్యవసాయంలో పాటించే పద్ధతులు, నీటి వినియోగం, సాగు ఖర్చు మరియు ఆదాయాలు రైతులతో మాట్లాడి తెలుసుకున్నారు. అదేవిధంగా ప్రకృతి వ్యవసాయంలో రైతుల పాటించే పద్ధతులు మరియు ప్రకృతి వ్యవసాయానికి రసాయనిక వ్యవసాయానికి మధ్య వ్యత్యాసాలను రైతులతో చర్చించారు.జి.ఐ.జెడ్ ప్రతినిధి నవీన్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ సంఘ నిర్వాహక ప్రకృతి వ్యవసాయ విభాగం ఆర్వైఎస్ఎస్ వారి ఆధ్వర్యంలో విస్తరిస్తున్న మరియు ఆచరిస్తున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతులను దేశానికి మరియు ప్రపంచానికి ఆదర్శమని అన్నారు. ఇక్కడ ఆచరిస్తున్న మెరుగైన ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పర్యావరణ మార్పులను తట్టుకొని సుస్థిరమైన వ్యవసాయ పద్ధతులను అధ్యయనం చేసి పాటించడానికి మిమ్మల్ని ఆదర్శంగా తీసుకుంటున్నామన్నారు.డి.వి. రాయుడు (సీనియర్ కన్సల్టెంట్) రైతు సాధికార సంస్థ (ఆర్వైఎస్ఎస్) రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ గత 60 సంవత్సరాలుగా రైతులు మితిమీరిన రసాయనిక ఎరువులు మరియు పురుగు మందులను వినియోగించడం వలన నేల మరియు నీరు కాలుష్యం అవుతున్నాయని ఆహారంలోని పోషక లభ్యత క్షీణించిందని, ఎక్కువ శాతం నైట్రోజన్ ఎరువులు వినియోగం వల్ల మీథైన్, నైట్రస్ ఆక్సైడ్ వంటి హరితగృహ వాయువులు విడుదలై వాతావరణ మార్పులకు కారణమవుతున్నాయి అన్నారు.

రాబోయే వాతావరణ మార్పులకు మరియు ప్రకృతి విపత్తులను తప్పించుకునేందుకు ఏకైక మార్గం ప్రకృతి వ్యవసాయమని, ప్రకృతి వ్యవసాయం అవలంబిస్తున్న రైతులు రాబోయే కాలానికి రథసారథులని పేర్కొన్నారు. ఎలియాజర్ (డిస్టిక్ ప్రాజెక్ట్ మేనేజర్ మేనేజర్ – ప్రకృతి వ్యవసాయ విభాగము) వారు ఇక్కడ ఆచరిస్తున్న ప్రకృతి వ్యవసాయం పద్ధతులు మరియు ఏ గ్రేట్ మోడల్ను వివరించారు. ఈ కార్యక్రమంలో జిఐజెడ్ అగ్రి యుఎన్ ఉమెన్ ఐఆర్ఆర్ఐ ప్రదన్, పిసిఐ, సిఎస్ఏ సంస్థల ప్రతినిధులు, జర్మనీ ప్రతినిధులు సూహెల ఖాన్, మాళవిక గోపీనాథ్, సాయి కిషోర్, సౌమిత చక్రవర్తి, నవీన్ హెూరి, డా. ఎస్. రాకేశ్, దక్ష మహీధర్, అంకిత పాల్, విక్రమ్ పాటిల్, అంతోనీ, శరణ్య, అంకిత హాజరిక, సుదర్శన్ ఖకుర్, మధబరంద్ర రాయ్, స్థానిక నాయకులు చిన్నం బాలవిజయరావు, అడ్డాల గోపాలకృష్ణ, రైతు సాధికార సంస్థ ప్రతినిధులు డా. రాయుడు, డా. జాకీర్ హుస్సేన్ (సైన్స్ టిఎల్) అరుణ (ఆర్ పిసి) డిపిఎమ్ ఎలియాజర్, ఏడి డిపిఎమ్ సత్యనారాయణ, ఏ.ఓ. శ్రీనివాస్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఏపి ఈఏపిసిఈటి-2024 నిర్వహణ బాధ్యతలు జెఎన్‌టియుకె కాకినాడ యూనివర్శిటీకి అప్పగింత

**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం సారథ్యంలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్, అగ్రికల్చర్ & ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపి ఈఏపిసిఈటి)–2024 నిర్వహణ బాధ్యతలను జెఎన్టియుకె కాకినాడ యూనివర్శిటీకి అప్పగించినట్లు ఉపకులపతి ప్రొ. జి.వి.ఆర్.ప్రసాదరాజు తెలిపారు.

రాష్ట్ర విభజన అనంతరం జెఎన్టియుకె కాకినాడ విశ్వవిద్యాలయం వరుసగా ఏడుసార్లు ఈఏపిసిఈటి పరీక్షలను ఎటువంటి అవరోధాలు లేకుండా దిగ్విజయంగా నిర్వహించినట్లు ఆయన తెలిపారు. జెఎన్టియుకె యూనివర్శిటీపై ధృడమైన నమ్మకంతో మరలా ఈఏపిసిఈటి పరీక్షల బాధ్యతలను అప్పగించడం పట్ల ఆయన రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ, రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జె.శ్యామలరావు, రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొ.కె.హేమచంద్రారెడ్డి లకు కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్రంలో ఎటువంటి అవరోధాలకు తావులేకుండా ఈఏపిసిఈటి–2024 పరీక్షలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించేందుకు తగిన చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు.ఈఏపిఇఈటి–2024 పరీక్షలకు ఛైర్మన్‌గా ఉపకులపతి ప్రొ. జి.వి.ఆర్.ప్రసాదరాజు వ్యవహరిస్తారని రిజిస్ట్రార్ ప్రొ. ఎల్.సుమలత తెలిపారు.

## నిజం బ్రతికించడం కోసం.. ప్రజా సంక్షేమం కోసం..

**– పవన్ కళ్యాణ్ రాజకీయాల్లోకి వచ్చారు**
**– జనసేన మండల అధ్యక్షులు ములకాల సాయి కృష్ణ**




**వి.ఆర్.పురం, మేజర్ న్యూస్ :** జనం కోసం, నిజాన్ని నిర్భయంగా చెప్పడం కోసం, ప్రజా సంక్షేమం కోసం, కొనెదల పవన్ కళ్యాణ్, జనసేన పార్టీని స్థాపించి. రాజకీయాల్లోకి వచ్చారని జనసేన పార్టీ మండల అధ్యక్షులు ములకాల సాయి కృష్ణ,తెలిపారు. మంగళవారం వరరామచంద్రాపురం మండల కేంద్రంలోని స్వగృహంలో,పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేదరిక నిర్మలన జరగాలంటే పవన్ కళ్యాణ్,రావాలి. పోలవరం నిర్వాసితులకు న్యాయం జరగాలంటే జనసేన, తెలుగుదేశం అధికారంలోకి రావాలి.ఉద్యోగులకు,ఫస్టు తారీకున జీతాలు రావాలంటే మార్పు రావాలని!ఆయన తెలిపారు.పోటీ చేసిన ప్రతీ నియోజకవర్గంలో గెలుపే లక్ష్యంగా జనసైనికులు,పట్టుదలతో ముందుకు వెళ్లాలని కోరారు.కొనెదల పవన్ కళ్యాణ్, అసెంబ్లీలో అడుగు పెడితే,ప్రజలకు మేలు జరుగుతుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. “జనసేన పార్టీ” మద్దతుతో ప్రభుత్వం ఏర్పాటు చేస్తే ప్రజల కష్టాలు తీరుతాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.5 సంత్సరాలు అన్నంపెట్టి బంగారు భవిష్యత్తుకి బాటలు వేసే ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని,రాష్ట్రంలో అన్నీ అర్హతలుఉన్న ఏకైక వ్యక్తి, కొనెదల పవన్ కళ్యాణ్,అని ఆయన అన్నారు.సమావేశంలో పార్టీ శ్రేణులు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## రికార్డు అసిస్టెంట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్



**రాజమహేంద్రవరం,మేజర్న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నందు రెండు రికార్డు అసిస్టెంట్ పోస్టుల భర్తీ కోసం విడుదల చేసిన నోటిఫికేషన్ సం.01/2019, తేదీ: 16.07.2019, కోవిడ్–19 కారణంగా పరీక్ష నిర్వహణ వాయిదా పడిన విషయాన్ని గతంలో పత్రికా ప్రకటన ద్వారా తెలియ జేయడమైనదని, ఆ వ్రాత పరీక్షను ఫిబ్రవరి 18వ తేదీన ఉ.10:00 గం. నుండి 12:30 గం. వరకు గోకవరం బస్టాండ్ సమీపంలోని రాజమహేంద్రి మహిళల డిగ్రీ మరియు పి.జి. కళాశాల నందు నిర్వహిస్తున్నామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత మంగళవారం ఒక పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. ఈ పరీక్ష కోసం షార్ట్ లిస్ట్ చేయబడిన అభ్యర్థులకు రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా హాల్ టికెట్లను పంపించగా, దరఖాస్తులో తెలిపిన చిరునామాలో అభ్యర్థులు లేకపోవడం మరియు ఇతర కారణాల వల్ల హాల్ టికెట్లు తిరిగి సంస్థకు వస్తున్నట్లు తెలిపారు. అలాంటి అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించి వారి హాల్ టికెట్లను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, రాజమండ్రి కార్యాలయమును నేరుగా సంప్రదించి పొందగలరని తెలిపారు.

# అన్నదాన భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామివారి అన్నదాన భవన నిర్మాణానికి సోమవారం విశాఖ పట్టణం పట్టణం పెందుర్తికి చెందిన సుంకరణం శ్రీధర్, వెంకట పద్మావతి దంపతులు రూ.1,11,111లు విరాళంగా అందించారు. వీరికి ఆలయ అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వామివారి దర్శనం చేయించారు. చైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు, ఈవో ముదునూరు సత్యనారాయణ రాజు, కమిటీ సభ్యులు, సిబ్బంది స్వామివారి చిత్రపటం అందించారు.

# పోలింగ్ బూత్‌లలో మౌలిక సౌకర్యాలు



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** రంపచోడవరం మండలం పరిధిలోని పోలింగ్ బూత్‌లలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసేవిధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని రంపచోడవరం మండల తహసీల్దార్ ఎ.కృష్ణజ్యోతి పేర్కొన్నారు. మంగళవారం రంపచోడవరం మండలం పరిధిలోని 13 పోలింగ్ బూతులను పరిశీలించడం జరిగిందని, అదేవిధంగా రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే, రంపచోడవరం సబ్ కలెక్టర్ యస్.ప్రశాంత్ కుమార్ ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు పోలింగ్ బూతులను పరిశీలించడం జరుగుతుందని ఆమె తెలిపారు. రంపచోడవరం మండలం పరిధిలో అన్ని పోలింగ్ బూత్‌లలో మౌలిక సదుపాయాలు ఏవిధంగా ఉన్నదీ పరిశీలించి పై అధికారులకు నివేదికలు సమర్పించడం జరుగుతుందని ఆమె తెలిపారు. ప్రతీ పోలింగ్ బూతులో కరెంటు, మరుగుదొడ్లు, పోలింగ్ భవనాలు ఏ విధంగా ఉన్నవీ పరిశీలించడం జరుగుతుందని ఆమె తెలిపారు. తహసిల్దార్ వెంట సీనియర్ అసిస్టెంట్లు ఇందిరా బాయి, చెల్లాయమ్మ, టి.లక్ష్మణ్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ యన్.విగ్నేష్, విఆర్వోలు పాల్గొన్నారు.



# నిబద్ధత, జాగరూకతతో ఎలక్షన్ విధులను నిర్వర్తించండి

**– బూత్ లెవెల్ అధికారులు, సూపర్వైజర్లు మరియు సెక్టర్ అధికారులకు దిశా నిర్దేశం**
**– కమిషనరు కె.దినేష్ కుమార్**



**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ :**మంగళవారం ఉదయం శ్రీవెంకటేశ్వరఆనంకళాకేంద్రంల బూత్‌లెవెల్ అధికారులు, సూపర్వైజర్లు,సెక్టరు అధికారులు, సెక్టర్ పోలీస్‌అధికారులు,ఎన్నికలకు సంబంధిం చిన వివిధ కార్యక్రమాల నిర్వహణకు నియమించిన నోడల్ అధికారులతో దినేష్ కుమార్ సమావేశం నిర్వహించారు. ఎన్నికల నిర్వహణ, సంబంధించిన కార్యక్రమాలపై సమీక్షి నిర్వహించారు .ప్రధానంగా ఎన్నికల సంఘం కల్పించిన హెూమ్ ఓటింగు సౌకర్యం గురించి దినేష్ కుమార్ వివరించారు. ఎన్నికల సంఘము ఆదేశముల మేరకు 80 సంవత్సరములు పైబడిన వృద్ధులకు, 40% ఎక్కువ దివ్యాంగులకి వారి ఐచ్చికం మేరకు పోలింగు బూత్ కు వెళ్ళి ఓటు వేయలేని దివ్యాంగులకు మరియు కోవిడ్ రోగగ్రస్తులకు యింటి దగ్గరే ఓటు వేసే హెూమ్ సౌకర్యం అందించ నున్నదని పేర్కొన్నారు. ఇప్పటికే బూత్ లెవెల్ అధికారుల వద్ద 80 సంవత్సరములు పైబడిన వృద్ధులు, దివ్యాంగుల యొక్క వివరములు యిప్పటికే సేకరించడం జరిగిందని, వారికి 12డి నమూనాలో దరఖాస్తులు చేయించడం జరుగుతుందన్నారు. అలాదరఖాస్తు చేసినవారి బూత్ లెవెల్ అధికారులు, సెక్టర్ అధికారుల ద్వారా ఓటు వేయించడం జరుగుతుందని అన్నారు. యిందు నిమిత్తం సంచార ఓటింగు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగు తుందని తెలియచేసారు. కానీ ఈ సౌకర్యం పొందదలచిన వారు తగిన ఆధారాలు చూపించాలని కోరారు. కోవిడ్ రోగగ్రస్తులను ఎన్నికల సంఘము నియమించిన మెడికల్ ఆఫీసరు ధృవీకరించ వలసియుంటుం దని అన్నారు. 12డి దరఖాస్తు యివ్వడానికివారి యింటికి వెళ్ళినపుడు వారు లేకపోతే బూత్ లెవెల్ అధికారి, సెక్టర్ అధికారి వివరములు తెలిసే విధముగా పేపరు అంటించి ఫొటోతీసుకొని భద్రపరుచుకోవాలని ఆదేశించారు. ప్రతియింటిని బూత్ లెవెల్ అధికారులు రెండుసార్లు సందర్శించాలని ఆ వివరములు నమోదు చేసుకోవాలని అన్నారు. ఒకసారి 12డి దరఖాస్తు చేసిన వారికి పోలింగ్ స్టేషన్ కు వెళ్ళి ఓటు వేసే అవకాశముండదని, అలాగే నిర్ణీత సమయంలో దరఖాస్తు చేసిన వారికి మాత్రమే హెూమ్ ఓటింగ్ సౌకర్యం ఉంటుందనీ, ఆ నిర్ణీత సమయము దాటిన తరువాత ఈ సౌకర్యము ఎవరికి కల్పించడం జరగదని అన్నారు. రాజమహేంద్రవరం సిటీ అసెంబ్లీ నియోజక వర్గానికి సంబంధించి సుమారు 6600 మంది హెూమ్ ఓటింగుకు సౌకర్యం పొందవలసి యున్నదని గుర్తించడమైనది. తదుపరి సెక్టరు ఆఫీసర్లు అందరు తమ సెక్టరుకు చెందిన పోలింగ్ స్టేషను చేరే రూట్ ను పరిశీలించి, ఎవరయినా మార్పు చేయాల్సి వుంటే వెంటనే తెలియచేయాలని అన్నారు.

అలాగే పోలింగ్ స్టేషనులలో కల్పించవలసిన సౌకర్యాల విషయమై ఆరా తీసారు. అన్ని పోలింగు కేంద్రాలలో నిర్దేశించినవిధముగాసౌకర్యాలు ఉన్నాయా లేదో పరిశీలించి నివేదికలు ఇవ్వాలన్నారు. .యింకా ఎక్కడయినా అవసరముంటే వాటి వివరాలు తెలియచేయాలని ఆదేశించారు అందరు తమకు కేటాయించిన సెక్టరులో ఉన్న అన్ని పోలింగు స్టేషను విధిగా సందర్శించి అన్ని సౌకర్యాలు ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రైవేట్ బిల్డింగులో వున్న పోలింగ్ కేంద్రాలలో నిర్దేశించిన సౌకర్యాలు ఉన్నాయో లేదో చూడాలని ఆదేశించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సెక్టరు పోలీస్ అధికారులు మరియు సెక్టరు అధికారులు కలిసి గుర్తించాలని, అందుకు ఎన్నికల సంఘము జారీ చేసిన మార్గ దర్శకాలను పాటించాలని పేర్కొన్నారు. అందులోని 7 అంశాలప్రకారము పోలింగు కేంద్రాలు వర్గీకరించాలని ఆదేశించారు. ఇందులో ఎటువంటి పొరపాట్లకు తావివ్వరాదని అన్నారు. సమస్యాత్మక పోలింగు కేంద్రాలను గుర్తించి సంబంధిత అధికారుల సంతకముతో జాబితాను రిటర్నింగ్ అధికారులకు సమర్పించాలని ఆదేశించారు. ఎన్నికల అధికారులకు శిక్షణ యివ్వటానికి నియమించిన మాస్టర్ ట్రైనర్లు తమకు కేటాయించిన అంశములపై సవివరమైన నోట్స్ తయారు చేసుకోవాలని, ది.09-02-2024 వ తేదీన బూత్ లెవెల్ అధికారులు, సూపర్వైజర్లు, సెక్టరు అధికారులు తదితరులకు శిక్షణ యివ్వాలని ఆదేశించారు. చివరిగా, అందరు అధికారులు తమకు కేటాయించిన విధులకు సంబంధించిఎన్నికల సంఘము జారీ చేసిన మార్గదర్శకాలను క్షుణ్ణముగా చదువుకోవాలని, ఎట్టి పరిస్థితిలోను విధివిధానములకు, ఎన్నికల సంఘము ఆదేశాలకు వ్యతిరేకంగా ప్రవర్తించరాదని, అలా ప్రవర్తించినవారిపైకఠినచర్యలు తీసుకొనబడ తాయని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ పి.ఎం. సత్యవేణి, సిటీ ప్లానరు జి.వి.ఎస్.ఎన్.మూర్తి, డిప్యూటి కమిషనరు, ఎస్.వి.రమణ, సెక్రటరీ కె.టి.సుధాకర్, తహశిల్దారు అర్బన్, డిప్యూటి సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (సెంట్రల్), బూత్ లెవెల్ అధికారులు, సూపర్వైజర్లు, సెక్టరు అధికారులు, సెక్టరు పోలీస్ అధికారులు, నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ స్టేషన్లు సందర్శించిన ఈఆర్వో

**– మౌలిక సదుపాయాలపై ఆరా**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ సిటీ నియోజకవర్గ ఈఆర్వో, నగరపాలక సంస్థ కమిషనర్ జే.వెంకటరావు మంగళవారం పలు పోలింగ్ స్టేషన్లను సందర్శించారు. జగన్నాధపురంలోని ఏటిమొగ, కొండబాబుకాలనీ, గౌరీ శంకర పేట, మత్స శాఖ కార్యాలయ ఆవరణలోని పిఎస్ లకు వెళ్లిన ఆయన మౌలిక సదుపాయాలను ఆరా తీశారు. ఆయా పోలింగ్ స్టేషన్లలో మంచినీరు, విద్యుత్, ఫర్నిచర్, ర్యాంపులు, ఇతర సౌకర్యాలు ఉన్నాయో లేదో పరిశీలించారు. ఏమైనా సదుపాయాల కొరత ఉంటే వెంటనే నివేదిక ఇవ్వాలని అక్కడి సిబ్బందిని ఆదేశించారు. ప్రతి పోలింగ్ స్టేషన్లోనూ విధి నిర్వహణలో ఉండే సిబ్బందికి, ఓటర్లకు ఎటువంటి అసౌకర్యం లేకుండా అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. ఆయన వెంట సూపర్వైజర్లు, బిఎల్వోలు ఉన్నారు.

## కాకినాడ జిల్లా రెవెన్యూ అధికారిగా డి.తిప్పే నాయక్





**కాకినాడ,మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీలలో భాగంగా కడప జిల్లాలో డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న డీ.తిప్పేనాయక్ మంగళవారం కాకినాడ జిల్లా రెవెన్యూ అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ డా.కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ సి.వి. ప్రవీణ్ ఆదిత్య లను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.

## వచ్చిన అవకాశాన్ని ఏజెన్సీ సేవల కోసం వినియోగిస్తా

**– తహశీల్ధార్ సయ్యద్ మౌలానా ఫాజిల్...**



**వి.ఆర్.పురం, మేజర్‌న్యూస్ :** వచ్చిన అవకాశాన్ని ఏజెన్సీలో సేవల కోసం పరమార్ధిగా భావించి పనిచేస్తానని వరరామ చంద్రాపురం తహాశీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్ స్పష్టంచేశారు. మంగళవారం ఆయన చాంబర్‌లో మాట్లాడుతూ అవకాశం ఉన్న,ప్రతీఅంశంలో ప్రతీ ఒక్కరికీ న్యాయం చేసేందుకుసిద్ధంగాఉన్నాననిహామీ ఇచ్చారు. ప్రతీ ఒక్కరూ తహాశీల్దార్ కార్యాలయ సేవలు వినియోగించు కోవాలని కోరారు.మీకోసం నేనున్నాను,మీ సమస్యల,పరిస్కారానికి తహాశీల్దార్ కార్యాలయంవేదికకావాలని ఆయన కోరారు.అనంతరం వై.ఎస్.ఆర్ పార్టీ మండల అధ్యక్షులు మాదిరెడ్డి సత్తిబాబు ఆధ్వర్యంలో ఘనంగాస్వాగతిస్తూ సన్మానించారు.ఏజెన్సీలోని మండల ప్రజలతో మమేకమై పనిచేస్తానని హామీ ఇవ్వడం మంచిపరిణామ మని,ఆయనఆనందంవ్యక్తం చేశారు.ఎంతకాలం, చేశామన్నది కాదు,ఎంతమంది హృదయాల్లో చోటు సంపాదించు కున్నామన్నది ముఖ్యమని ఆయన అన్నారు. ప్రజల మనస్సులను గెలిచే విధంగా పనిచేయాలని సూచించారు.సన్మాన కార్యక్రమంలో ఎస్.టి.ఎస్.సి.కమిటీ డివిజన్ కమిషన్ సభ్యులు చిక్కాలబాలకృష్ణ, (బాలు)జె.సి.ఎస్.మండలఇంచార్జీబొడ్డు సత్యనారా యణ, రాష్ట్ర నాయకులు ముత్యాల శ్రీనివాసరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులు మాచర్ల గంగయ్య, సీనియర్ నాయకులు కాపారపు ఉమామహేశ్వరరావు, సీనియర్ నాయకుడు ముత్యాల గౌతమ్,మామిడి రాజు,మోడెం నరేష్ యాదవ్,చీమలకాంతారావు, మాచర్ల వెంగళరావు,ఉపసర్పంచ్‌ముంజపురాము హాజరయ్యారు.

## అంకిత భావంతో పని చేస్తే లాక్ష్యాన్ని చేరుకోవచ్చు...



**వి.ఆర్.పురం, మేజర్ న్యూస్ :** కృషిపట్టుదల ఉంటే ఆర్థిక ఇబ్బందులను, దరిచేరకుండా అనుకున్న లక్ష్యాన్ని అద్భు తంగా చేరంకోవచ్చని నిరూపించింది.ఓమహిళ వివరాల్లోకి వెళితే ఏజెన్సీ అల్లూరి సీతారామరాజు జిల్లా, రంపచోడవరం, నియో జకవర్గం, చింతూరు,డివిజన్ వరరామచంద్రా పురం, మండలం రేఖపల్లి,పంచా యతీ పరిధిలో చాపల వ్యాపారం ప్రారంభించడానికి ఎంతో వ్యయప్రయాసలకుఓర్చి చిన్నగా వ్యాపారం మొదలు పెట్టింది.ఎర్రం రమణమ్మ,అనే మహిళ"కష్టంగాఉన్నా"ఇష్టంతో! ఎండనకా!వాననక వ్యాపారం చేస్తూ మెలుకోవలు తేలుసుకోంది.ఇద్దరు కుమారులను చదివిస్తూ ఆదర్శంగా నిలిచింది.

పెద్ద కుమారుడు ప్రశాంత్,డిగ్రీ వరకు చదువు కున్నాడువ్యాపారంలో తల్లికి తోడుగా ఉంటూ!చదవు కొనసాగిస్తున్నాడు.చిన్న కొడుకు 10 క్లాస్ చదవుతున్నాడు. స్త్రీశక్తి చాలా బలమైందని,"ఝాన్సీ రాణి,రాణిరుద్రమదేవి,స్పూర్తితో ఎర్రం రమణమ్మ, ప్రభుత్వం ఆదుకోకపోయినా దిగులు చెందకుండా కష్టాన్నే నమ్ముకుని జీవిస్తున్న ఈ మహిళామణి తోటి మహిళలకు ఆదర్శంగా నిలిచింది. ప్రస్తుత వై.సి.పి.ప్రభుత్వం, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి,ఆదుకోవాలని,ఋణ సదుపాయం కల్పించాలని ప్రభుత్వాన్ని వేడుకొంటోంది.కట్టుకున్న వాడే పెట్టాలి,తినాలి అంటే సాధ్యమైన పని కాదని,స్వశక్తితో బ్రతకాలి అనే నిర్ణయం తీసుకుంది. నోరుమంచిదైతే ఊరుమంచిదని నిరూపించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటుంది.

## ఆరోగ్యశ్రీ ద్వారా మరిన్ని మెరుగైన సేవలు

**– పరిమితి పెంపుతో పేదలకు మరింత ప్రయోజనం**
**– కార్పొరేషన్ కమిషనర్ జె. వెంకటరావు**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** వైయస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వైద్య సేవలు పొందే పరిమితిని ప్రభుత్వం రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచిందని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు చెప్పారు. ఇప్పటికే అనేక వైద్య సేవలను ఆరోగ్యశ్రీ లో చేర్చిన ప్రభుత్వం ఇప్పుడు వైద్య సేవల పరిమితిని కూడా పెంచడం వల్ల పేద ప్రజలకు ఎంతో ప్రయోజనకరమన్నారు. స్థానిక జగన్నాధపురం 25వ డివిజన్ పరిధిలోని న్యూ మున్సిబ్ జంక్షన్ సచివాలయంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతిక శుక్లా ఆదేశాల మేరకు ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని కమిషనర్ వెంకటరావు మంగళవారం పర్యవేక్షించారు. అక్కడకు వచ్చిన ఆరోగ్యశ్రీ లబ్ధిదారులతో కమిషనర్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ కార్పొరేషన్ పరిధిలో 83 వేలమంది లబ్ధిదారులు ఆరోగ్యశ్రీ కార్డులకు అర్హులుగా గుర్తించారన్నారు. సుమారు 74 వేల కొత్త ఆరోగ్య శ్రీ కార్డులు వచ్చాయన్నారు. వీటిలో 56 వేల కార్డులను ఇప్పటికే పంపిణీ చేశామని కమిషనర్ చెప్పారు. అతి త్వరలోనే మిగిలిన కార్డుల పంపిణీ ప్రక్రియ కూడా పూర్తి చేస్తామన్నారు. ఆయన వెంట ఎంహెచ్ వో డాక్టర్ పృధ్వీచరణ్, ఏఎన్‌ఎంలు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

## సజావుగా ఎన్నికల నిర్వహణే లక్ష్యం

**– ఈఆర్వో, కమిషనర్ వెంకటరావు**
**– రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** రానున్న ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించడంలో రాజకీయ పార్టీ ప్రతినిధుల సహకారం కూడా ఎంతో అవసరమని కాకినాడ సిటీ నియోజకవర్గ ఈఆర్వో, నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు పేర్కొన్నారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం జరిగింది. ఓటర్ల సంక్షిప్త సవరణ %--%2024లో భాగంగా ఫారం-6, 7, 8 ద్వారా వచ్చిన దరఖాస్తులు, వాటి ప్రగతిని ఈఆర్వో వివరించారు.ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధుల సందేహాలను ఈఆర్వో నివృత్తి చేశారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ సమస్యాత్మక ప్రాంతాల్లో తీసుకోవలసిన చర్యలు, టిడ్కో ఇళ్ళకు డోర్ నెంబర్ల కేటాయింపు సహా వివిధ అంశాలను సమావేశంలో ప్రస్తావించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఇచ్చే సూచనలు, సలహాలను కూడా పరిగణనలోకి తీసుకుంటామన్నారు. బిఎల్‌వోలతో సమావేశం :ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఏఈఆర్వోలు, బిఎల్‌వోలతో కమిషనర్, ఈఆర్వో వెంకటరావు వేర్వేరుగా సమావేశమయ్యారు. రానున్న రోజుల్లో చేపట్టాల్సిన వివిధ కార్యక్రమాలపై సూచనలు ఇచ్చారు. పోలింగ్ స్టేషన్లలో కల్పించాల్సిన సదుపాయలపై చర్చించారు.

## సర్పంచ్‌ల నిర్బంధం



**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ :**రాజ్యా ంగంలో పొందుపరిచిన విదంగా గ్రామ సర్పంచ్ లకు హక్కులు కల్పించాలని, నిధులు సక్రమంగా విడుదల చేయాలనే డిమాండుతో సర్పంచ్ లు తలపెట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని పోలీసులు అడుగడుగునా అడ్డుకున్నారు. రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు బాబురాజేంద్రా ప్రసాద్ ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం చలో అసెంబ్లీ కార్యక్రమానికి మండల పరిధిలోని ఆత్రేయపురం, లొల్ల, మెర్లపాలెం, అంకంపాలెం , రాజవరం, వద్దిపర్రు, గ్రామాల సర్పంచ్‌లు సమాయత్తం అయ్యారు. జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం రాత్రి నుంచి సర్పంచ్‌ల కదలికలపై పోలీసులు నిఘా ఉంచారు. గ్రామాల నుంచి సర్పంచ్‌లు చలో అసెంబ్లీకి తరలివెళ్ళకుండా ఆయా గ్రామాల్లో మహిళా పోలీసులు నిర్బంధించారు. మెర్లపాలెం సర్పంచ్ మెర్ల రాము ని ఇంటి వద్ద హౌస్ అరెస్ట్ చేశారు.

# సికిల్ సెల్ వ్యాధి నిర్ధారణకు రక్త నమూనాలు సేకరణ



**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని గ్రామాలలో సికిల్ సెల్ వ్యాధి ఉన్న వారిని గుర్తించేందుకు రక్త నమూనాలను ఎ యన్ ఎం లు ద్వారా సేకరించడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే పేర్కొన్నారు.మంగళవారం రంపచోడవరం ఐటీడీఏ సమావేశం హాలులో ఏడీఎం అండ్‌హెచ్‌ఓ, అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సంబంధించిన వైద్యాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అదేవిధంగా మరి కొంతమందితో సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులను రక్త పరీక్షలు చేసే విధంగా ప్రాజెక్ట్ అధికారి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రంపచోడవరం ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలోని ఏడు మండలాలలో రెండు లక్షల 18వేల 385మంది జనాభా ఉన్నారని, ఏడు మండలాల్లో 18 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పరిధిలో ప్రతీ ఇంటికి వెళ్లి సికిల్ సెల్ పరీక్షలు, అదేవిధంగా అన్ని పాఠశాలలలో ఏఎన్‌ఎంలు రక్త నమోనాలు స్వీకరించి సికిల్ సెల్ పరీక్షలు నిర్వహించేందుకు 79,425 కిట్లు ఏజెన్సీ ప్రాంతానికి రావడం జరిగిందని, అదేవిధంగా ప్రతీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రక్తపరీక్ష కిట్లు సరఫరా చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో సికిల్ సెల్ టెస్టులు తప్పనిసరిగా చేయాలన్నారు. సికిల్ సెల్ టెస్టులకు సంబంధించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. వ్యాధిగ్రస్తులు ఇరువురు యువతీయువకులు పెళ్లిళ్లు చేసుకోకూడదన్నారు. సికిల్ సెల్ వ్యాధి ఉన్న వ్యాధిగ్రస్తులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా పింఛన్లు ప్రతీ నెలా అందజేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో జెయస్‌పి పథకం ఏ విధంగా నిర్వహిస్తున్నది, అదేవిధంగా ప్రతీ నెలా ఎంతమంది గర్భిణీ స్త్రీలకు డెలివరీ చేస్తున్నారు, అదేవిధంగా ఎంతమంది గర్భిణీ స్త్రీలను రిఫర్ చేసి సిజేరియన్ ద్వారా డెలివరీ చేస్తున్నారో వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సమావేశంలో ఏడీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ జి.ప్రకాశం, వైద్యాధికారులు రాధిక, కెల్విన్, సాహిని,ఎంపిహెచ్‌ఓ పీటర్, జిసిసి డిఎం జి.పార్వతీశ్వరరావు, వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సంబంధించిన వైద్యాధికారులు పాల్గొన్నారు.

# జిసిసి, వెలుగు ద్వారా 'జాఫ్రా'లు కొనుగోలు



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలో జాఫ్రాలు పండించే గిరిజన రైతులు దళారుల దగ్గర మోసపోకుండా జిసిసి, వెలుగు ద్వారా కొనుగోలు చేసే విధంగా ప్రతిపాదనలు చేయడం జరిగిందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే పేర్కొన్నారు. రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో మంగళవారం జిసిసి డివిజనల్ మేనేజర్, సీనియర్ మేనేజర్లు, వెలుగు సిబ్బంది, పి హెచ్ ఓ, ప్రాజెక్ట్ అగ్రికల్చరల్ అధికారితో సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన రైతులు పండించిన జాఫ్రాలు కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఐటీడీఏ ద్వారా కొనుగోలు చేసిన జాఫ్రాలను వివిధ కంపెనీలకు సంబంధించిన ప్రతిని ధులతో సంప్రదించి మార్కెట్‌కు పంపే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలి పారు. గత సంవత్సరం జాఫ్రాలు, చింతపండు, పసుపు ఎన్ని మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసింది, ఈ సంవత్సరం ఎన్ని మెట్రిక్ టన్నులు కొనుగోలు చేస్తున్నారో వివరాలు సంబంధిత అధికారుల ద్వారా తెలుసుకున్నారు. కొనుగోలు చేసిన జాఫ్రాలు, చింతపండు, పసుపు ఎక్కడ స్టోరేజీ చేస్తున్నారు, అదేవిధంగా ఏజెన్సీ ప్రాంతంలో ఎంతమంది జాఫ్రా రైతులు ఉన్నది, ఎన్ని ఎకరాలలో జాఫ్రా సాగు చేస్తున్నారని పిఓ ఆరా తీశారు. జాఫ్రా రైతులు దళారుల దగ్గర మోసపోకుండా జిసిసి, వెలుగు ద్వారా కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిసిసి డివిజనల్ మేనేజర్ జి. పార్వతీశ్వరరావు, ప్రాజెక్ట్ హర్టికల్చర్ అధికారి చిట్టిబాబు, ప్రాజెక్ట్ అగ్రికల్చరల్ అధికారి రాంబాబు, జిసిసి సీనియర్ మేనేజర్లు ముర్ల నాగ వెంకట రాజారెడ్డి, జి.చంద్రశేఖర్, వెలుగు డిపిఎం పరమేశ్వరరావు, వెలుగు యాంకర్ పర్సన్ రామరాజు పాల్గొన్నారు.

## టిడిఆర్ బాండ్ల కుంభకోణంపై కొన్ని రాజకీయ పక్షాలు ఎందుకు మౌనముద్ర దాల్చాయి? - ప్రశ్నించిన బిజెపి



కాకినాడ, మేజర్ న్యూస్ : టిడిఆర్ బాండ్లు భూకొనుగోళ్లకు వినియోగించరాదని, కేవలం రోడ్ల వెడల్పు చేయటం, కాలువల నిర్మాణం కారణంగా భూములు కోల్పోయినవారికి మాత్రమే ఈ టిడిఆర్ బాండ్లను విడుదల చేయవలసి ఉంటుందని భారతీయ జనతా పార్టీ పేర్కొంది.మంగళవారం ఉదయం భారతీయ జనతా పార్టీ నగర కన్వీనర్ గట్టి సత్యనారాయణ గృహంలో ఏర్పాటు చేసిన పత్రిక ప్రతినిధుల సమావేశంలో గట్టి సత్యనారాయణ, మీడియా ప్యానలిస్ట్ దువ్వూరి సుబ్రహ్మణ్యం మాట్లాడారు. తొలితుగా టిడిఆర్ బాండ్లు అనేవి మహారాష్ట్ర ప్రభుత్వం బొంబాయిలో ఉపయోగించిందని తరువాత ఇది ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు కూడా విడుదల చేస్తున్నాయని, అయితే ఇది కేవలం రోడ్లు వెడల్పు చేయటం, కాల్వల నిర్మాణం కారణంగా భూమి కోల్పోయినవారికి మాత్రమే ఈ టిడిఆర్ బాండ్లను విడుదల చేయవలసి ఉంటుందని, ఇంజనీర్ కూడా అయిన గట్టి సత్యనారాయణ తెలియజేశారు. నగరంలో ఇటీవల చేసుకున్న అతిపెద్ద టిడిఆర్ బాండ్ల కుంభకోణంపై ప్రధాన ప్రతిపక్షం స్థానిక నాయకత్వం ఒక్కసారిగా మౌనం వహించడం, కొన్ని రాజకీయ పార్టీలు అసలు స్పందించకపోవడం పట్ల ప్రజలు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని బిజెపి నాయకులు పేర్కొన్నారు. ఈ కుంభకోణంపై గవర్నర్ ను కలిసేందుకు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర పార్టీ గవర్నర్ అపాయింట్మెంట్ కోరనున్నదని గట్టి సత్యనారాయణ, దువ్వూరి సుబ్రహ్మణ్యం మీడియాకు చెప్పారు. ఈ టిడిఆర్ బాండ్లను రాష్ట్రంలో ఎక్కడైనా అమ్మే అవకాశం ఉన్న నేపథ్యంలో ఇప్పటికే కొందరు నాయకులు ఈ టిడిఆర్ బాండ్లను విశాఖ వంటి ఇతర నగరాల్లో అమ్ముతున్నట్లుగా తమ దృష్టికి వచ్చిందని, ఈ టిడిఆర్ బాండ్లు కొనుగోలు విషయమై ప్రజలు, బిల్డర్లు అప్రమత్తంగా ఉండాలని బిజెపి నాయకులు హెచ్చరించారు. రానున్న ఎన్నికల్లో నగరంలో జరుగుతున్నటువంటి భూకుంభకోణాలను ప్రధాన అజెండాగా భారతీయ జనతా పార్టీ మారుస్తుందని గట్టి, దువ్వూరి అన్నారు. నగరంలో కొందరు మున్సిపల్ అధికారులు ఏళ్ల తరబడి తిష్ట వేసి కూర్చున్నారని, స్థానిక వైయస్సార్ పార్టీ నాయకత్వం అండదండలతోటే ఇది జరుగుతోందని గట్టి తీవ్రంగా ఆరోపించారు. ఈ మీడియా ప్రతినిధుల సమావేశంలో పానకాల రామకృష్ణ, కొండేటి గంగాధర్ పాల్గొన్నారు.

## జాతీయ స్థాయిలో జరిగే రేలా పండుగకు తరలిరండి

**– పిలుపునిచ్చిన ఆదివాసి జేఏసీ**



**దేవిపట్నం, మేజర్ న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా, చింతూరు మండల కేంద్రంలో ఈనెల 9,10,11 తేదీలలో జాతీయ స్థాయిలో జరిగే రేలా పండుగకు ఆదివాసీలందరూ తరలిరావాలని, ఆదివాసి జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...నేటికీ ఆదివాసులు పకృతిని దైవంగా భావించి పూజించే విధానం కొనసాగుతుందన్నారు. కావున 5వ,షెడ్యూల్డ్ ప్రాంత ఆదివాసీల సంస్కృతి,సాంప్రదాయాలను పాఠ్యాంశాలలో చేర్చాలన్నారు. 1.భూమి ,భూమి పండుగ)భూదేవి పండుగ 2.నీరు (గంగలమ్మ పండుగ,వాన పండుగ 3.అడవి వనదేవతల పండుగ,కొండ (అడవి) రాజుల బాబు పండుగ ఇలా ప్రతి ఏడాది సాంప్రదాయ బద్ధంగా ఆదివాసులు జరుపుకునే అనేక పండుగలకు సెలవు దినాలు ప్రకటించాలని డిమాండ్ చేశారు.అత్యంత ప్రాచీనమైన సువిశాలంగా విస్తరించిన ఆదివాసీ సంస్కృతి ఒక మైలురాయి అని అన్నారు.భారతీయ సంస్కృతి పుట్టింది ఆదివాసుల నుంచే అని గుర్తు చేశారు.ఈ నేపథ్యంలో ఆదివాసీ సంస్కృతి పరిరక్షణ కొరకు ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జిల్లా,చింతూరు మండల కేంద్రంలో ఈనెల 9,10,11 తేదీలలో జాతీయస్థాయిలో ప్రతిరోజు సాయంత్రం 6 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు ఆదివాసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమానికి ఆర్థిక సహాయ సహకారాలు అందించేవారు.ఈ కార్యక్రమానికి వచ్చేవారు పూర్తి వివరాల కొరకు ఈ క్రింది సెల్ నెంబర్లను 95739 46097 లేదా 9642067386 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

సూర్య
తూర్పుగోదావరి
బుధవారం
7 ఫిబ్రవరి 2024
3

## అన్నవరప్పాడు వెంకన్న ఆలయ వాస్తు నిర్మాణాలను పరిశీలించిన దేవాదాయ శాఖ స్థపతి



**పెరవలి, మేజర్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం అన్నవరప్పాడు గ్రామంలో 16వ నెంబర్ జాతీయ రహదారి ప్రక్కన వేంచేసి ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి ఫిబ్రవరి 6వ తేదీ మంగళవారం వాస్తు లోపాలు ,భవిష్యత్తు నిర్మాణాల నిమిత్తం దేవాదాయ శాఖ డిప్యూటీ స్థపతి శ్రీనివాసాచారి సందర్శించారు.

ఈ సందర్భంగా ఆలయ కార్య నిర్వహణ అధికారి మీసాల రాధాకృష్ణతో కలిసి ఆలయ పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించి సరి చేయవలసిన చిన్నచిన్న వాస్తు లోపాలు ఆయనకు తెలియజేశారు. అదేవిధంగా భవిష్యత్తు అవసరాలకు ఆలయంలో నిర్మించ వలసిన కట్టడాల గురించి కూడా చర్చించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి మీసాల రాధాకృష్ణ తెలియజేశారు.

# పెరవలి ఎస్సైగా ఏజీఎస్ మూర్తి



**పెరవలి, మేజర్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండల ఎస్ఐగా ఏజీఎస్ మూర్తి నవంబర్ 5వ తేదీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు ఆయన గతంలో పశ్చిమగోదావరి జిల్లా భీమవరం పట్టణంలో పనిచేశారు. సాధారణ బదిలీలలో భాగంగా పెరవలి ఎస్సైగా పనిచేయుచున్న ఎం సూర్య భగవాన్ ఎన్టీఆర్ జిల్లాకు బదిలీ కావడంతో పెరవలి ఎస్సైగా ఏజిఎస్ మూర్తి పెరవలికి వచ్చారు. ఈ సందర్భంగా పెరవలి పోలీస్ స్టేషన్ సిబ్బంది ఏఎస్ఐ ప్రసాదరావు రైటర్ బుద్దేశ్వర రావు కానిస్టేబుళ్లు సాంబ హనుమంతు తదితరులు ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికి అభినందించారు.

# అర్చక సమస్యలు పరిష్కరించండి..

- కోస్తా జిల్లాల అర్చకుల ఐక్యత సమావేశం
- విజయవంతమైన ఆదిశైవ ఆత్మీయ సమ్మేళనం
- దేవాలయాల్లో అర్చకుల ప్రాముఖ్యత పెంచాలి
- రాష్ట్ర అధ్యక్షులు మురమళ్ళ రాంబాబు డిమాండ్

**రామచంద్రపురం, మేజర్ న్యూస్ :** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆదిశైవుల ఆత్మీయ సమావేశం రామచంద్రపురం పసలపూడిలో విజయవంతంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో రాష్ట్రం నలుమూలల నుండి కోస్తా జిల్లాలకు సంబంధించిన పలు దేవాలయాలలోని ఆది శైవ అర్చక స్వాములు వారి కుటుంబీకులు పలు రకాల వృత్తులు ఉద్యోగాలలో ఉన్న ఆదిశైవులు ఈ ఆత్మీయ సమావేశానికి హాజరయ్యారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని దేవాదాయ ధర్మాదాయ శాఖ అర్చకుల జీవన విధానాన్ని మెరుగుపరిచేందుకు కోర్టు ఉత్తర్వులు 696/87 అమలు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. నేటికీ ఆ తీర్పు అమలు కాకపోవడం అర్చక లోకానికి దురదృష్టకరమని రాష్ట్ర ఆదిశైవసంఘ అధ్యక్షులు శ్రీ యనమండ్ర సత్య సీతారామశర్మ దేవాదాయ శాఖ తీరుపై ధ్వజమెత్తారు. ఆదివారం రామచంద్రపురం లో జరిగిన కోస్తా జిల్లాల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. 34 సంవత్సరాలు గడిచినప్పటికీ సుప్రీంకోర్టు తీర్పు అమల కాకపోవడంతో అర్చకులు చాలీచాలని జీతాలుతో గడపవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. నాటి సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం దేవాలయాల్లో సెక్యులర్ స్టాఫ్ ను తగ్గిస్తూ ధార్మిక స్టాఫ్ ను పెంచాలని ఆదేశాలు ఉన్నాయి. కానీ వాటిని పట్టించుకోకుండా





సెక్యులర్ స్టాఫ్ ను మాత్రం పెంచుతూ దేవాలయానికి అతి ముఖ్యమైన ధార్మిక స్టాఫ్ ను తగ్గిస్తూ నేటికీ నానావిధ కష్టాలను గురి చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు దేవాలయాలను నిర్వహించేది అర్చకులు మాత్రమేనని వాటిపై అధికారుల పెత్తనంతో అసలు అర్చకుడికే మోసం జరుగుతోందని అన్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనం ద్వారా ప్రభుత్వ దృష్టికి తమ డిమాండ్లను తీసుకువెళ్లేందుకు ప్రయత్నిస్తున్నామని అన్నారు. అందులో ప్రధానంగా జీవో 439 ప్రకారం వాటాదారులు అందరి పేర్లు 43/10 లో నమోదు చేయాలన్నారు. రాష్ట్రంలో అర్చకులందరికీ హెల్త్ కార్డులు మంజూరు చేయాలని మురమళ్ళ రాంబాబు కోరారు. 25000 రూ.పే స్కేల్ తీసుకునే అర్చకులకు 010 ట్రెజరీ లేక 65' ద్వారా జీతాలు చెల్లించాలన్నారు. డిడిఎన్ఎస్ స్కీమ్ ఆలయాలను పెంచి అక్కడ పనిచేస్తున్న అర్చకులు మెరుగైన జీవనోపాధికి దేవాదాయ శాఖ చర్యలు తీసుకోవాలన్నారు. కనీస వేతనం ప్రతి అర్చకునికి 25 వేల రూపాయలు ఉండేలా చూడాలని కోరారు. అర్చకులు స్వాధీనంలో ఉన్న సర్వీస్ ఈనాం భూములకు అనుభవదారులుగా అర్చకుల్ని గుర్తించాలన్నారు. 19 జూలై 2023 తేదిన రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జిఓ నెంబర్ 310 ప్రకారం అర్చకులు ఇనాం భూములకు వర్తింపజేయాలని విన్నవించారు. అడంగల్ వన్ బి లలో అనుభవదారులైన అర్చకులు పేర్లు నమోదు చేసి రైతు భరోసా పథకం వర్తింపజేయాలని స్పష్టం చేశారు. 33/2007 చట్ట సవరణ ప్రకారం జీవో ఎంఎస్ నెంబర్ 439 ప్రకారం అర్చక స్కీములు వెంటనే తయారుచేసి అమలుచేయాలని విజ్ఞప్తి చేశారు. ఆంగ్ల విద్య నభ్యసించిన అర్చక కుటుంబ సభ్యులకు తగిన ఉద్యోగాలు దేవాదాయ శాఖలో కల్పించాలని డిమాండ్ చేశారు. శైవాగమ పాఠశాలలు అన్ని జిల్లాల్లో ఏర్పాటు చేయాలనిపేర్కొన్నారు. అన్యాక్రాంతమైన భూములను తిరిగి దేవాదాయ శాఖ హేండ్ వర్ చేసుకోవాలని విన్నవించారు. ఈ సమావేశంలో యలమంచిలి కృష్ణమూర్తి శివాచార్య మాజీ రాష్ట్ర అధ్యక్షులు అల్లవరపు సుబ్రహ్మణ్య దీక్షితావధాని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పత్రి అనిల్ కుమార్ రాష్ట్ర కోశాధికారి మురికిపూడి కృష్ణ కిషోర్ కాళ్ళకూరి దుర్గాప్రసాద్ శివాచార్య కాళ్ళకూరి సాంబమూర్తి జిల్లా అధ్యక్షులు దొంతుకుర్తి కాశీ విల్లూరి వీరభద్రరావు చంద్రమౌళి దుర్గాప్రసాద్ కొత్తలంక శ్రీనివాసరావు మాచరి చిన సత్యనారాయణ మూర్తి తదితరులతోపాటు ఆదిశైవ కుటుంబ సభ్యులు వయోవృద్ధులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సమావేశం పూర్తిస్థాయిలో విజయవంతమైంది.

## మందిర నిర్మాణానికి లక్ష విరాళం యిచ్చిన "రామకృష్ణ సేవా సమితి"



**అనపర్తి, మేజర్ న్యూస్ :** కోల్ కత్తాలోని దక్షిణేశ్వర్ రామకృష్ణ మఠం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న అవతార వరిష్టులు భగవాన్ శ్రీ రామకృష్ణ పరమహంస విశ్వజనీన మందిరానికి అనపర్తి రామకృష్ణ సేవా సమితి రూ.లక్ష విరాళం అందజేశారు. మంగళవారం రాజమహేంద్రవరం శ్రీరామకృష్ణ మఠంలో మఠం అధ్యక్షులు స్వామి పరిజ్ఞేయానందజీ మహారాజ్‌కి సమితి సమకూర్చిన లక్ష రూపాయల చెక్కును స్థానిక సమితి వ్యవస్థాపక కార్యదర్శి మల్లిడి శ్రీనివాసరెడ్డి (లెఫ్ట్), ఎం దుర్గాప్రసాద్ అందచేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మిషన్ సభ్యులు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ భగవాన్ శ్రీ రామకృష్ణ పరమహంస ఆధ్యాత్మిక సాధనలు అనుష్టించిన దివ్య క్షేత్రం దక్షిణేశ్వర స్వామి అని అన్నారు. కోల్ కత్తాలో నిర్మిస్తున్న విశ్వజనీన దేవాలయానికి ఆర్థిక సేవలు అందించడం ఆనందదాయకంగా ఉందని దుర్గాప్రసాద్ అన్నారు. సమితి దాతృత్వాన్ని పరిజ్ఞేయానందజీ మహారాజ్ కొనియాడారు.

## దళితులకు అన్యాయం చేస్తే సహించేదిలేదు

- పిఠాపురంలో జనసేన నాయకులు అత్యుత్సాహం ప్రదర్శించారు
- పీవి రావు మాల మహానాడు అధ్యక్షులు పండు అశోక్ కుమార్



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** దళితుల అన్యాయం చేస్తే సహించేదిలేదు పిఠాపురంలో జనసేన నాయకులు అత్యుత్సాహం ప్రదర్శించారని, ఈ విషయంపై జిల్లా ఎస్పీని కలుస్తామని పీవి రావు మాల మహానాడు జాతీయ అధ్యక్షులు పండు అశోక్ కుమార్ అన్నారు. పిఠాపురం పట్టణంలో జనసేన నాయకులు మాదేపల్లి శ్రీనివాసరావు అనే వ్యక్తిపై రెక్కి జరిగిందని... జనసేన నాయకులు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసి, పాత్రికేయ సమావేశం నిర్వహించారు. ఈ విషయం పలు పత్రికలు, న్యూస్ చానెల్స్‌లో రావడంతో... తమకు అందిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు ప్రాధమిక విచారణ చేపట్టారు. జనసేన నాయకులు విడుదల చేసిన సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా కొంతమంది యువకులను గుర్తించారు. ఆ యువకులు దళిత సామజిక వర్గానికి చెందిన వారు కావడంతో... సంఘటనపై సమాచారం అందుకున్న పివి రావు మాల మహానాడు జాతీయ అధ్యక్షులు పండు అశోక్ కుమార్ స్టేషన్ వద్దకు చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. ఆ యువకులతో మరియు వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... జరిగిన సంఘటనపై నిజా నిజాలు తెలుసుకోకుండా స్థానిక జనసేన నాయకులు అత్యుత్సాహం ప్రదర్శించారని, దళితులపై ఇలాంటి చర్యలు మానుకోవాలని హెచ్చరించారు. దళితులకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోమన్నారు. జరిగిన సంఘటనపై జిల్లా ఎస్పీని కలిసి వివరిస్తామన్నారు.

## ఎంపీడీవో నాతి బుజ్జి సేవలు అభినందనీయం



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** ఆత్రేయపురం మండల పరిషత్ అభివృద్ధి అధికారిణిగా మండల పరిధిలోని గ్రామాల్లో విశిష్ట సేవలు అందించిన ఎంపీడీవో నాతి బుజ్జి సేవలు అభినందనీయమని ఎంపీపీ కుండా అన్నపూర్ణ, జడ్పిటిసి బోనం సాయిబాబా, వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ కనుమూరి శ్రీనివాసరాజులు అన్నారు. మంగళవారం బదిలీ ఆత్రేయపురం మండలం నుంచి చాగల్లు ఎంపీడీవోగా బదిలీ అయిన ఎంపీడీవో నాతి బుజ్జి సన్మాన కార్యక్రమం మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో నిర్వహించారు. వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు వేదికను ఆలంకరించగా, వివిధ గ్రామాల నుంచి వచ్చిన సచివాలయ సిబ్బంది, ఐసిడిఎస్, ఎన్ఆర్ఈజీ, తదితరు శాఖలకు చెందిన సిబ్బంది తదితరులు ఎంపీడీవో సేవలను కొనియాడారు. నాలుగున్నర సంవత్సరాలపాటు ఆత్రేయపురం మండలం ఎంపీడీవోగా సిబ్బందితో తనకున్న పరిజ్ఞానంతో మండలాన్ని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచేందుకు, ఉన్నతాధికారుల మన్ననలను పొందేందుకు ఎంపీడీవో ఎంతో కృషి చేశారని పలువురు వక్తలు కొనియాడారు. అలాగే సచివాలయ బిల్డింగులు, జగనన్న ఇండ్ల స్థలాలు పంపిణీ, వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, జగనన్న కాలనీల అభివృద్ధిలో ఆత్రేయపురం మండలం ప్రథమ స్థానంలో నిలిచేందుకు ఎంపీడీవో నాతిబుజ్జి అనుభవం ఎంతగానో పనిచేసిందని అన్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, అధికారులు మండలంలోని 17 గ్రామాల సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం బదిలీపై వెళ్లిన ఎంపిడిఓ నాతిబుజ్జిని శాలువాలు, పూలమాలలతో పలువురు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆత్రేయపురం ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఈవోపీఆర్డి శ్రీనివాస్ ఎంఈఓ వరప్రసాదరావు, పరిపాలన అధికారి సురేందర్ రెడ్డి, ఆర్ఐ భవాని, సర్పంచ్ లు మెర్ల రాము, గాదిరాజు రామకృష్ణంరాజు, కరటూరి బ్రహ్మాజీ, వేముల శ్రీనివాస్, జుజ్జవరపు హరిబాబు, కార్యదర్శులు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

## మెరిట్ విద్యార్థులకు మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ చెక్కులు పంపిణీ



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ మరియు సిఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా మెరిట్ విద్యార్థులకు చెక్కులు పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. రాజమండ్రి శాఖ ఆధ్వర్యంలో విమెన్ ఎంపవర్మెంట్‌కుగాను ఎంపికైన పేద మెరిట్ విద్యార్థినిలకు 316 మందికి రాజమండ్రి ఆనంద రీజెన్సీలో జరిగిన కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ సీఎం తేజ్ భరత్ చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేశారు. జిల్లాలో 316 మందిని ఎంపికగా ఆత్రేయపురం మహాత్మా గాంధీ జూనియర్ కళాశాలకు చెందిన 42 మంది విద్యార్థినులకు సుమారు నాలుగు లక్షల రూపాయలు విలువ చేసే చెక్కులను జాయింట్ కలెక్టర్ చేతుల మీదుగా అందుకున్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ సిఎస్ఆర్ వారు బాలికల విద్యాభివృద్ధికి, నిరుపేదలకు గృహ నిర్మాణం, హంగర్ స్ట్రైక్ అరికట్టడం కోసం మరియు ఓల్డ్ ఏజ్ హోమ్స్ నిర్వహించడం లాంటి సేవా కార్యక్రమాలు చేస్తుందని, దానిని ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు చేయడానికి ముందుకు రావాలన్నారు. విద్యార్థినిలకు చెక్కులు అందించిన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ సిఎస్ఆర్ ఫౌండేషన్ వారికి, కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ పి.ఎస్. రాజు, ప్రిన్సిపాల్ బి.వి.ఆర్ లకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్టోర్స్ మెయిన్ హెడ్ ఈశాంత్ మహమ్మద్, వెంకట్ ప్రవీణ్, విగ్నేష్ మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో ఎమ్మెల్యే ఫోటోలను తొలగించాలి -నల్లమిల్లి



**అనపర్తి, మేజర్ న్యూస్ :** అనపర్తి ప్రాంతీయ ఆసుపత్రిలో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా స్థానిక ఎమ్మెల్యే ఫొటోలను ఆసుపత్రిలో ఏర్పాటు చేయడం జరిగిందని, నిబంధనలకు విరుద్ధంగా ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన ఎమ్మెల్యే ఫోటోను తొలగించాలని లేనిపక్షంలో న్యాయస్థానాన్ని ఆశ్రయించడమే కాకుండా ధర్నా చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నామని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఈ విషయమై ఆసుపత్రి సూపరిండెంట్ వారికి ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ స్థానిక ఆసుపత్రిలో ఏ నిబంధనలను అనుసరించి ఎమ్మెల్యే ఫోటోలు పెట్టారు అన్న విషయమై జిల్లా వైద్యశాల సమన్యాయ అధికారి వారికి సమాచార హక్కు చట్ట ప్రకారం వివరణ కోరుతూ గతంలో ఫిర్యాదు చేయడం జరిగిందని, సమాచార హక్కు చట్టం - 2005 ని అపహాస్యం చేస్తూ 45 రోజుల తరువాత సమాచారం (సమాధానం ) ఇవ్వడం జరిగిందని,ఈ రెండు సంఘటనలకు బాధ్యులపై చట్ట ప్రకారముగా చర్యలు తీసుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే అభివృద్ధిలో పూజ్యం ప్రచారం మాత్రం అధికంగా చేసుకోవడం జరుగుతుందని ఎక్కడికి అక్కడ ఆర్చీలు నిర్మించడం, ప్రభుత్వ భవనాలపై ఆయన పేర్లు సిమెంటు లెటర్స్ తో రాయించుకోవడం, ప్రభుత్వ ఆసుపత్రి, సచివాలయంలో ఆయన ఫోటోలు పెట్టించుకోవడం పరిపాటిగా మారిందని విమర్శించారు. జిల్లా వైద్య సేవల సమన్వయ అధికారి రెండు ఉల్లంఘనలకు పాల్పడడం జరిగిందని 30 రోజుల్లో సమాధానం ఇవ్వాలని లేని పక్షంలో అప్పీల్ కి వెళ్లి హైకోర్టులో పిటిషన్ వేసి సమాచారం రాబట్టుకోవచ్చని అంతేకాకుండా సమాచార హక్కు చట్టం ప్రకారం వారిపై చర్యలు తీసుకునే అవకాశం ఉందని తెలిపారు. మేము ఏదైతే విషయంపై స్పష్టంగా సమాచారం కోరమో దానిపై వివరణ ఇవ్వాలని అంతేగాని విషయాన్ని పక్కదారి పట్టించే ధోరణి కూడా తీవ్ర నేరమని ఈ రెండింటికి వైద్య సమన్వాధికారి చట్టనికి విరుద్ధంగా వ్యవహరించడం జరిగిందని అన్నారు. ఆ ఫోటోలు తొలగించే వరకు ఆస్పత్రి ఆవరణలోనే తెలుగుదేశం పార్టీ తరపున ఆందోళన చేయడం జరుగుతుందని నల్లమిల్లి రామకృష్ణారెడ్డి హెచ్చరించారు. రామవరం గ్రామంలో గ్రామపంచాయతీ భవనం పైన ఆనాడు జన్మభూమి కార్యక్రమం కింద సుదీర్ఘకాలం శాసనసభ్యునిగా సేవలందించిన నల్లమిల్లి మూలారెడ్డి పేరు పెట్టడం కోసం ఐదు లక్షల రూపాయలు కేటాయించి కలెక్టర్ గారి ఉత్తర్వుల మేరకు పేరు పెడితే 2019లో సూర్యనారాయణ రెడ్డి ఎమ్మెల్యే కాగానే మూలారెడ్డి పేరు తొలగించడం జరిగిందని రామకృష్ణారెడ్డి అన్నారు. నిబంధనల ప్రకారం ఉన్న పేరు తొలగిస్తారు, కానీ మరి ఏ నిబంధనల మేరకు మీరు ఆర్చీలు పెట్టి పేర్లు, ఫోటోలు అదేవిధంగా ప్రభుత్వ భవనాల పైన, ప్రభుత్వ కార్యాలయాల్లో పెట్టారో తెలపాలని అన్నారు. అదేవిధంగా పెదపూడి పిహెచ్సి, ఆర్చిలకు ఫోటోలు, పేర్లు పెట్టుకునే అధికారం ఎవరిచ్చారు అంటూ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే వైద్య శాఖ అధికారులు ఎమ్మెల్యే అనధికారికంగా పెట్టించుకున్న ఫోటోలు, పేర్లు తొలగించాలని డిమాండ్ చేస్తున్నామని నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమం అనపర్తి మండల, అనపర్తి టౌన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎలక్ట్రోరల్ రోల్‌పై వచ్చిన అభ్యర్థనలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారించాలి





**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఎలక్ట్రోరల్ రోల్‌పై వచ్చిన అభ్యర్థనలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారించాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారిణి డా.కృతికాశుక్లా అధికారులను ఆదేశించారు. ఎన్నికల సన్నద్ధత, ఎలక్ట్రోరల్ రోల్ పై మంగళవారం కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా.. జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య, వివిధ నియోజకవర్గాల ఈఆర్వోలతో కలిసి సమీక్షించారు. ఫాం 6, 7, 8 దరఖాస్తుల పరిష్కారం, తుది ఓటర్ల జాబితాలోని సమస్యలు, మార్పులు చేర్పులు, 18-19 ఓటర్ల వివరాలు, పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు, ఎన్నికల సిబ్బందికి శిక్షణ, పోలింగ్ కేంద్రాలు, ఈవీఎంలు, వీవీపాడ్స్ స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలు, సెక్టోరియల్ సిబ్బంది నియామకం, శిక్షణ, మోడల్ పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఖాళీల భర్తీ వివరాలు వంటి అంశాలపై ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులతో చర్చించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఈఆర్వో అప్రమత్తుతో విధులు నిర్వర్తించాలన్నారు. తప్పనిసరిగా ఎన్నికల కమిషన్ నిబంధనలు అమలు చేయాలన్నారు. జనవరి 22న ముద్రించిన తుది ఓటర్ల జాబితాపై వచ్చిన అభ్యంతరాలు మార్పులు, చేర్పులు, బదలాయింపు వంటి అంశాలకు సంబంధించిన ఫారం 6, 7, 8లను క్షుణ్ణంగా పరిశీలించి వాటిని పరిష్కరించాలన్నారు. ఓటరు జాబితాలో ఫోటోలు సక్రమంగా వుండేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆమె తెలిపారు. 18-19 వయసు మధ్య ఉన్న యువతను ఓటర్లుగా నమోదు చేయడంతో పాటు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తూ స్వీప్ కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ అధికారులు స్పష్టం చేశారు. ప్రాముఖ్యంగా ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్ వద్ద విద్యుత్, తాగునీరు, వాహనాల రూట్ మ్యాప్ ప్రణాళిక ప్రకారం ఏర్పాటు చేయాలన్నారు. నియోజకవర్గాలలో ప్రతివారం రాజకీయ పార్టీ ప్రజలతో సమావేశాలు నిర్వహించాలన్నారు. ప్రతి మండలానికి ఒక మోడల్ పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు వివరాలు అందించాలని కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. సమావేశంలో ఇన్చార్జి డీఆర్వో, డీఆర్డీఏ పీడీ కె.శ్రీరమణి, కాకినాడ కమిషనర్ జె.వెంకటరావు, కెఎస్ఈజెడ్ ఎస్డీసీ కె.వి.రామలక్ష్మి, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఇట్ల కిషోర్, జె.సీతారామరావు, బిసి కార్పొరేషన్ ఈడీ అద్దంకి శ్రీనివాసరావు, డీపీవో కె.భారతి సౌజన్య, ఏపీఈపీడీసీఎల్ ఈఈ ప్రసాద్, ఆర్టీసీ ఆర్ఎం ఎం.శ్రీనివాసు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 11న దళిత సింహగర్జనను విజయవంతం చేయండి

- దళిత నాయకులు మాజీ ఎం.పి హర్షకుమార్ తనయుడు జీ.వి శ్రీరాజ్, ఎంఆర్‌పిఎస్ నాయకులు పిలుపు



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** మాయమాటలతో మోసం చేసిన వై.యస్ జగన్ ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా దళితులంతా ఏకమవ్వాలని మాజీ ఎం.పి హర్ష కుమార్ తనయుడు జీవి శ్రీరాజ్ అన్నారు. మంగళవారం ఉదయం ఈనెల 11న రాజమహేంద్రవరం రూరల్ వేమగిరిలో దళిత నాయకులు, మాజీ ఎంపీ జి.వి. హర్షకుమార్ నేతృత్వంలో నిర్వహిస్తున్న ఈ సభ విషయమై దళిత నాయకులు వరిగేటి కిరణ్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో జీవి శ్రీరాజ్ మాట్లాడుతూ సామాజిక,ఆర్థిక, రాజకీయ రంగాలలో వెనకబడిన దళిత జాతులకు మేలు చేస్తారని వైసీపీ ప్రభుత్వాన్ని గెలిపిస్తే అధికారంలోకి వచ్చాక జగన్ నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు. ఎస్సీ కార్పొరేషన్ నిర్వీర్యం చేసి సబ్ ప్లాన్ నిధులను నవరత్నాల పేరుతో దారి మళ్ళించారని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా దళితులపై హత్యలు, అఘాయిత్యాలు జరుగుతున్నా నోరు విప్పకుండా ప్రభుత్వంలో ఉన్న దళిత నాయకులను కీలుబొమ్మలను చేసి ఆడిస్తున్నారని దుయ్యబట్టారు. మాల, మాదిగ, రెల్లి కార్పొరేషన్ అంటూ దళితులను విభజించి రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నించారన్నారు. ఇప్పటికైనా దళిత జాతి వర్గాలు మేల్కొని తమ నిరసన గళం వినిపించకపోతే భవిష్యత్తులో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని,ఎస్సీ రిజర్వేషన్లను రద్దు చేసే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. మాజీ ఎంపీ జి.వి. హర్షకుమార్ నేతృత్వంలో నిర్వహిస్తున్న దళిత గర్జనకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దళితులంతా తరలివచ్చి తమ హక్కులకే సింహలా గర్జించాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో దళిత నాయకులు కొమ్ము ప్రభాకర్ రావు, తెనాలి కిరణ్, ఇందుగుమిల్లి చిరంజీవి, పసలపూడి, పాపారావు, పౌరోజు మాణిక్యాలరావు, తాతపూడి సత్యనారాయణ, పౌరోజు చిరంజీవి,తాతపూడి ఆనంద్, చంద్రమళ్ళ బాసి,దేవదాసు రమేష్, పల్లేటి సత్తిబాబు, చిర్రా శ్యాం కుమార్, ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కాండ్రేగుల వైసీపీ నుండి 20 మంది టిడిపిలో చేరిక

- జగ్గంపేట నియోజవర్గంలో వైసిపి పూర్తిగా ఖాళీ అయ్యే పరిస్థితి రాబోతుంది
- జ్యోతుల నెహ్రూ



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** జగ్గంపేట మండలం ఇర్రిపాక శివాలయం వద్ద మంగళవారం జగ్గంపేట మండలం గ్రామానికి చెందిన బో దిరెడ్డి చిన్నయ్య, బోదిరెడ్డి పార్వతీశ్వరరావు, అడబాల బాబురావు, బందారు శ్రీనివాసు, సోమిశెట్టి ఏసుబాబు, సురాబత్తుల శివ, కొప్పన శివ తదితర 20 కుటుంబాలు కాండ్రేగుల మాజీ సర్పంచ్ మాజీ ఎంపీటీసీ సభ్యులు సీనియర్ టిడిపి నాయకులు రామిశెట్టి చంద్రరావు ఆధ్వర్యంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు జ్యోతుల సమక్షంలో వైసిపి వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరిని నెహ్రూ సాదరంగా స్వాగతించారు. ఈ సందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ రోజురోజుకీ వైసీపీ నుండి టిడిపిలో చేరికలతో జగ్గంపేటనియోజకవర్గంలో వైసిపి పూర్తిగా ఖాళీ అయ్యే పరిస్థితి వచ్చిందని టిడిపి జనసేన సంకీర్ణ ప్రభుత్వానికి ప్రజలందరూ సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నారని రేపు రాబోయే ఎన్నికల్లో జగన్ రెడ్డి ఓడిపోవటానికి సిద్ధంగా ఉన్నారని జ్యోతుల నెహ్రూ అన్నారు. ఈ కార్యక్రమంలో కంచుమర్తి రాఘవ, బుర్రి భీముడు, యల్లపు దొరబాబు, రామిశెట్టి పాపారావు, బోదిరెడ్డి కామేశ్వరరావు, బో దిరెడ్డి సత్యనారాయణ, కామన దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

## భవిత కేంద్రాన్ని పరిశీలించిన ఎంఇఓలు



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో స్థానిక మహాత్మా గాంధి మున్సిపల్ స్కూల్‌లో నిర్వహిస్తున్న భవిత కేంద్రాన్ని మండల విద్యాశాఖాధికారులు ప్రభాకర శర్మ, బి.ఆర్.కె.చౌదరిలు పరిశీలించారు. దీనిలో భాగంగా భవిత కేంద్రంలో చదువుతున్న పిల్లలందరి అటెండెన్స్, స్టాఫ్ రిజిష్టర్, రికార్డులను పరిశీలించి, అనంతరం భవితలో చదువుతున్న పిల్లల తల్లితండ్రుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. అలాగే ఫిజియోథెరపి కేంద్రం కూడా పరిశీలించి, పిల్లల యొక్క శారీరక సమస్యలను ఫిజియోథెరపిస్ట్ ద్వారా అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో బి.దుర్గాప్రసాద్‌రెడ్డి, ఆనందరావు, సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లితండ్రులు పాల్గొన్నారు.

## మన్యంలో రేషన్ బియ్యం క్రయ విక్రయాలు..?

**– కొనుగోలు చేసి వాహనాల్లో తరలింపులు –పట్టించుకోని సంబంధిత అధికారులు...**

**దేవిపట్నం, మేజర్ న్యూస్ :** నాటి గడ్డు రోజుల్లో పంటలు పండక అతివృష్టి, అనావృష్టి కారణంగా నిరుపేదలు ఆకలితో అలమటించేవారు. అయితే నేటి యాంత్రిక కాలంలో రేషన్ ద్వారా ప్రభుత్వ చౌకధరల దుకాణం ద్వారా సరఫరా చేసే బియ్యం నేడు ఓట్ల కోసం అందరికి ఇస్తుండటంతో ఆ బియ్యాన్ని తినడానికి ఇష్టపడకుండా వ్యాపారుల పరం చేస్తున్నారు. అల్లూరిజిల్లా రంపచోడవరం నియోజక వర్గం దేవిపట్నం మండలంలోని ఇందుకూరు పేట కేంద్రంగా రేషన్ బియ్యం వ్యాపారం కొన్ని సంవసత్సరాలుగా యథేచ్ఛగా సాగుతుందని బహిరంగంగానే మాట్లాడుకుంటున్నారు. సమాజానికి హాని చేసే అక్రమ ,అసాంఘిక కార్యకలాపాల వల్ల యువత చెడిపోతుందని వాటిపై దృష్టిపెడుతున్న అధికారులు,ప్రజాప్రతినిధులు పేదవాడి ఆకలి తీర్చాల్సిన రేషన్ బియ్యం ,పక్కదారిపడుతున్న పట్టించుకోకపోవడంపై పలువురు ఆవేదంవ్యక్తం చేస్తున్నారు.ఈ అక్రమ వ్యాపారం వల్ల ప్రజలకు హాని కలగక పోయినా ఈ రేషన్ బియ్యం విక్రయించే వారితో పాటు ఆ బియ్యాన్ని అన్నం వండుకునే పేదవారికి సైతం రేషన్ దూరమయ్యే పరిస్థితులు దాపురిస్తాయని గుర్తించాలి.

# పోలింగ్ కేంద్రాలను ముందస్తుగా తనిఖీ చెయ్యాలి

**– అందరూ తహశీల్దార్లు వారి మండలంలోని అన్నీ పోలింగ్ కేంద్రాలను వ్యక్తిగతంగా తనిఖీ చెయ్యాలి**
**– ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం సహించే ప్రసక్తే లేదు**
**– ఓటరు నమోదు, తొలగింపు, మార్పులు చేర్పులు దరఖాస్తు పెండింగ్‌లో లేకుండా పూర్తి స్థాయిలో పరిష్కారం చెయ్యాలి**
**– వాటికి సంబంధించి పూర్తి స్థాయిలో వివరాలు అందచేసి ఆమోదం పొందడం తప్పనిసరి**
**– ఎక్కడ సమన్వయ లోపం ఉండరాదు**
**– కలెక్టర్ / జిల్లా ఎన్నికల అధికారి కె. మాధవీలత**

**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** ఎన్నికల నిర్వహణ ముందస్తు గా మానవ వనరుల సమగ్ర వివరాలు క్రోడీకరించు కోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా కె. మాధవీలత స్పష్టం చేశారు. మంగళవారం ఉదయం కలక్టరేట్ లో ఎన్నికల నోడల్ అధికారులతో జిల్లా స్థాయి లో, క్షేత్ర స్థాయి అధికారులు , సిబ్బంది తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జాయింట్ కలెక్టర్ ఎన్. తేజ్ భరత్, డి ఆర్వో జి. నరసింహులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ, ఈ ప్రక్రియ లో సంభందిత నియోజక వర్గ ఈ ఆర్ వో బూత్ స్థాయి అధికారులు పూర్తి స్థాయిలో నియామకం పూర్తి చేయాలన్నారు. ప్రతి బిఎల్వో తన పరిధిలోని ఓటరు జాబితా ఎటువంటి తప్పులు లేకుండా సరి చూసుకోవాల్సిన బాధ్యత వహించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం చేయడం సహించడం జరగదని, ఇప్పటికే జిల్లాలో నలుగురు బి ఎల్ వో లను సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణ లో నిర్లక్ష్యం వహించరాదని మాధవీలత తెలియ చేశారు. ఎట్టి పరిస్థితుల్లో ఎన్నికల్లో తప్పులు చేస్తే ఉపేక్షించడం జరగదని , ఆ విషయంలో ఎన్నికల కమిషన్ పరిధిలోనిదని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. ఓటరు జాబితా విషయంలో మరింత జాగ్రత్త వహించాలని, తొలగింపుకు వచ్చిన దరఖాస్తులు తరచుగా పరిశీలన చేయాల్సి ఉంటుందని మాధవీలత పేర్కొన్నారు. వివిధ మాధ్యమాలలో, రాజకీయ పార్టీల ద్వారా వస్తున్న ఫిర్యాదులను ఏ రోజుకి ఆరోజే పరిష్కారం చేయాలన్నారు. గుతగుప్పంగా (బల్క్) ఎట్టి పరిస్థితుల్లోనూ దరఖాస్తులను స్వీకరించరాదని, ఫారం 7 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆమేరకు వారికి అవగాహన కల్పించడం ముఖ్యం అన్నారు. పోలింగ్ కేంద్రాలను అన్నింటినీ రిటర్నింగ్ అధికారి తప్పకుండా తనిఖీ చేయాలన్నారు. అక్కడ పోలింగ్ కేంద్రాల వాస్తవ పరిస్థితిని ముందస్తుగా నిర్ధారణ చేసుకోవడం అత్యంత ప్రాధాన్యత అంశమని పేర్కొనడం జరిగింది. ప్రవేట్, ప్రభుత్వ స్కూల్స్ లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను గుర్తించి తనిఖీ చేయటం చాలా అవసరం అన్నారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి నివేదిక ఇవ్వాలని కోరారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాలకు సంబందించి 7 అంశాలు తో కూడిన నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. సెక్టరాల్ ఆఫీసర్ ను ప్రతీ రూట్ కి నియమించడం జరిగిందన్నారు. ఆర్వోలు ముందస్తుగా సెక్టరల్ అధికారులలో సమావేశం నిర్వహించి రూట్ మ్యాప్ ప్రకారం వారు పేర్కొన్న అంశాలను పరిగణనలోకి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. బి ఎల్ వో ల యొక్క పేరు, ఫోన్ వివరాలూ ఆయా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసే స్కూల్స్ బయట ప్రదర్శన చేయటం ద్వారా ఓటర్ల కి వొచ్చే సందేహాలను నివృత్తి చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను నియోజక వర్గం రిటర్నింగ్ అధికారులు తనిఖీలు చేపట్టి నిర్ధారణ చేసుకోవడం తప్పని సరి అని కలెక్టర్ మాధవీలత తెలిపారు. అదే కేంద్రాల వద్ద కమిషనింగ్ పని కూడా చేపట్ట వలసిన దృష్ట్యా అందుకు అనుగుణంగా అదనపు రూమ్ లు ఉండాలని సూచించారు. తగిన రూమ్లు, మౌలిక సదుపాయాలు, ఈ వి ఎమ్ ఇతర అనుబంధ పరికరాలు భద్రత వ్యక్తిగత శ్రద్ద తీసుకోవడం ముఖ్యం అన్నారు. ట్రైనింగ్ సెంటర్ లను ముందస్తుగా నిర్ధారణ చేసుకోవాలనీ పేర్కొన్నారు. వొచ్చే వారం నుంచీ నియోజక వర్గాల వారీగా తనిఖీలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ మాధవీ లత తెలిపారు. హోమ్ వోటింగ్ అంశం చాలా కీలకం అని జిల్లా కలెక్టర్ మాధవీలత పేర్కొన్నారు. 80 ప్లస్ , దివ్యాంగులు, కోవిడ్ పాజిటివ్ ఓటర్ల ద్వారా 12 డి ద్వారా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. బి ఎల్ వో లకి ఈ ఓటింగు కి సంబంధించి పూర్తి సమాచారం ఉండడం చాలా అవసరం అన్నారు. ఇందుకు అనుగుణంగా రూట్ మ్యాప్ ప్రకారం ప్రణాళిక రూపొందించుకోవాలని సూచన చేశారు. సంబంధింత దరఖాస్తు చేసుకున్న వ్యక్తి ఓటు ఇవ్వవచ్చో లేదోనిర్ధారణ చేసుకొవాలని అన్నారు. నన్నయ్యా యూనివర్సిటీ ప్రాంగణంలో రిసెప్షన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గ వారీగా కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. స్టాట్యూటరీ , నాన్ స్టాట్యూటరీ ఫార్మ్స్ భద్రపరిచడం కోసం ప్రత్యేక రూం ప్రత్యేకంగా కేటాయించాలని అన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్.. తేజ్ భరత్ మాట్లడుతూ, ఎన్నికల తేదీ ప్రకటించే నాటి నుంచి ఎన్నికలు పూర్తి అయ్యే వరకు ఏ రోజు ఏ విధమైన బాధ్యతలు చేపట్టవలసి ఉంటుందని నమూనా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఆమేరకు అధికారులు అందరూ ఖచ్చితంగా వాటిని అమలు చేసేందుకు, ముందస్తుగా క్షేత్ర స్థాయిలో తనిఖీ చేపట్టవలసి ఉంటుందని పేర్కొన్నారు.

రాజమండ్రీ రూరల్ ఆర్వో జాయింట్ కలెక్టర్ ఎన్. తేజ్ భరత్, రాజమండ్రీ అర్బన్ ఆర్వో మునిసిపల్ కమిషనర్ కె. దినేష్ కుమార్, కొవ్వూరు ఆర్వో , సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్ , రాజానగరం ఆర్వో ఆర్డీఓ ఏ. చైత్ర వర్షిణి, గోపాలపురం – ఓఎన్జీసి ఎస్.డి.సి., ఎమ్. వెంకట సుధాకర్, అనపర్తి – స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (గెయిల్ (ఐ) లిమిటెడ్) ఎమ్. మాధురి , నిడదవోలు – స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, పి ఐ పి ఆర్ ఎమ్ సి యూనిట్–%×%, కొవ్వూరు ఆర్ వి రమణా నాయక్ లు క్షేత్ర స్థాయిలో తీసుకున్న చర్యలు, ప్రణాళిక పై సమగ్ర వివరాలు తెలియ చేశారు.ఈ సమావేశంలో కె ఆర్ ఆర్ సి ఎస్ డీ సి కృష్ణ నాయక్ , ట్రైనీ ఆర్డీఓ ఎమ్. భాను ప్రకాష్ , అన్ని శాఖల నోడల్ అధికారులు పాల్గొన్నారు.

## రాజకీయ పార్టీ ప్రతినిధులతో ఈఆర్వో సమావేశం



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** భారత ఎన్నికల కమీషన్ షెడ్యూల్ ప్రకారం తుది ప్రచురణ, తొలగింపు, చేర్పులు, సవరణల గురించి 2024 సాధారణ ఎన్నికల నిర్వహణకు సంసిద్దతలకు సంబంధించిన అంశములపై రాజకీయ పార్టీ ప్రతినిధులతో ఈఆర్వో జె.సీతారామారావు మంగళవారం చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన తెలుపుతూ ఫారం–6కు 214 ధరఖాస్తులు, మరణించినవారు లేదా శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లినవారు ఫారం–7కు 667 ధరఖాస్తులు మరియు ఓటర్ల జాబితాలో మార్పులు సవరణ కొరకు ఫారం–8కు 1451 ధరఖాస్తులు వచ్చాయని ఈ సమావేశంలో తెలిపారు. అలాగే గత వారంలో వచ్చిన చేర్పులు తొలగింపులు, దిద్దుబాట్లు ఫారం–9, ఫారం–10, ఫారం–11, ఫారం–11ఎ, మరియు ఫారం–11బి లకు సంబంధించిన ధరఖాస్తులు మరియు క్లైములు, అభ్యంతరాలు (ఫారం–6, ఫారం–7, ఫారం–8) సంబంధించి క్లైములు వెంటనే ఆన్‌లైన్ చేసి, వాటిపై చర్యలు తీసుకోవాలని, ఏఇఆర్వోలను మరియు సూపర్‌వైజర్లను ఆర్డీఓ ఆదేశించారు. తుది ప్రచురణ మరియు తొలగింపులు, చేర్పులు, సవరణల గురించి మరియు 2024 సాధారణ ఎన్నికల సంసిద్దతలకు సంబంధించిన అంశములకు ప్రక్రియకు సంబంధించి రాజకీయ పార్టీ ప్రతినిధులు యొక్క సలహాలు, సూచనలు ఈ సమావేశంలో తీసుకోవడం జరిగింది. ఈ సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు జడ్పిటిసి గవరసాన సూరిబాబు(వైకాపా), రంధి సత్యనారాయణ (టిడిపి), ఏఈఆర్వోలు శ్రీనివాసరెడ్డి, కె.వి.పద్మావతి, సామర్లకోట మున్సిపల్ కమీషనర్ జె.రామారావు, పలువురు రాజకీయ పార్టీల ప్రతినిధులు, టిపిఓ ఫణికుమార్, మున్సిపల్ మేనేజర్ యు.జ్యోతిరాణి, ఆర్వో వి.చంద్రశేఖరం, డిటి కాంతారావు, ఎలక్షన్ డిటి భారతి, రెవెన్యూ ఆర్ఐ కాంతారావు, మున్సిపల్ ఆర్ఐ సుబ్రహ్మణ్యం, పలువురు అధికారులు పాల్గొన్నారు.

## సొంతింటి కల నిజం చేసిన ఘనత సిఎం జగన్‌కే దక్కింది

**– దవులూరి**




**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** సొంతింటి కలను నిజం చేసిన ఘనత సిఎం వైయస్ జగన్మోహన్‌రెడ్డికే దక్కిందని, పెద్దాపురం నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జి దవులూరి దొరబాబు తెలిపారు. మంగళవారం పెద్దాపురం పురపాలక సంఘ పరిధిలో స్థానిక వాలుతిమ్మాపురం రోడ్డులో నిర్మించిన టిడ్కొ ఇళ్ళు రెండవ విడత పంపిణీ కార్యక్రమం మున్సిపల్ కమీషనర్ కె.వి.పద్మావతి ఆధ్వర్యంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, వైస్‌ఛైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా దవులూరి దొరబాబు పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుపేదలకు సొంతిళ్ళను నిర్మించి పేదలకు అందజేయడం జరిగిందని ఆయన తెలిపారు. వైస్‌ఛైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ మాట్లాడుతూ త్వరలో మిగతా టిడ్కొ ఆపార్ట్‌మెంట్‌లను పూర్తి చేసి లబ్దిదారులకు ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. అనంతరం అపార్ట్‌మెంటులను ప్రారంభించి, వారి చేతుల మీదుగా లబ్దిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు త్సలికి సత్యభాస్కరరావు, విడదాసరి రాజా, పలువురు కౌన్సిలర్లు, వైసిపి నాయకులు తాటికొండ పెదకాపు, ముమ్మన ప్రకాష్, సహారా రమేష్, మున్సిపల్ అధికారులు, టిడ్కొ ఇఇ రీటా, ఏఇ సుధీర్, కెపిసి ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.వాసుదేవరావు, ప్రాజెక్ట్ మేనేజర్ మునిశేఖరరెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ టిఎన్‌వి.నరేష్, లబ్దిదారులు, తదితరులు పాల్గొన్నారు.

## సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ చేసే స్త్రీ, పురుషులు వివరాలు సచివాలయాలలో అందజేయాలి

**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పురపాలక సంఘ పరిధిలో సివరేజ్ డ్రైనేజెస్ మరియు డి స్లడ్జింగ్ ఆపరేషన్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్‌లు క్లీనింగ్ నందు పనిచేయు స్త్రీ మరియు పురుషులు రాష్ట్ర ప్రభుత్వ ఉత్వర్వుల మేరకు సంబంధిత వివరాలు ఆయా వార్డుల పరిధిలో గల సచివాలయాల నందు శానిటేషన్ సెక్రటరీల వద్ద నమోదు చేయించుకోవాలని, మున్సిపల్ కమీషనర్ ఒక ప్రకటనలో భాగంగా తెలిపారు. దీనికి సంబంధించి ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఏదైనా సంస్థలో పనిచేస్తున్న గుర్తింపు కార్డు, కుటుంబ వివరాలు, వారి యొక్క ఆదాయ వివరాలు (జీతభత్యాలు నకళ్ళు), అందజేయాలని సూచించారు.

## ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు



**పెద్దాపురంరూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం మండలం ఆనూరు (కొండపల్లి) గ్రామంలో రైతు నల్లల లోవరాజు ఆయిల్ పామ్ తోటలో మంగళవారం పెద్దాపురం ఉద్యానవన శాఖ మరియు పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన జరిగింది. ఈ కార్యక్రమంలో పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ డిజిఎం డి.రవీంద్ర మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగు విస్తరణ, నీటి యాజమాన్యం, ఎరువులు, యాజమాన్యం, అధిక దిగుబడులు గురించి రైతులకు తెలిపారు. మండల ఉద్యానవన శాఖ అధికారులు ఎన్.సుజాత మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న రాయితీలు మరియు తెగుళ్ళ నివారణ గురించి వివరించారు. పతంజలి ఫుడ్స్ మేనేజర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గెలల కోత మరియు నాణ్యతపై రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ఫీల్డ్ ఆఫీసర్ డి.ఎల్.వెంకటేశ్వరరావు, క్లస్టర్ ఇన్‌చార్జి ఎం.వెంకటసాయి, విహెచ్ఏ చంద్రరావు, మధు, కంపెనీ క్షేత్ర సిబ్బంది, రైతులకు పాల్గొన్నారు. అనంతరం దీనిలో భాగంగా ఉలిమేశ్వరంలో చిక్కం వారి తోటలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు.

## గొల్లప్రోలులో సాగునీరు అందక కళ తప్పుతున్న పంటపొలాలు

**– లబోదిబోమంటున్నా అన్నదాతలు**



**గొల్లప్రోలు, మేజర్ న్యూస్ :** ఆరుగాలం శ్రమించిసాగు చేస్తున్నగొల్లప్రోలు దాల్వాపంటపొలాలకు సాగునీరు కొరతతో గొల్లప్రోలుమండలం సీతానగరం లక్ష్మీపురం బలబద్రం గండేవారు కాలువ పైఆయకొట్టుభూములు సాగునీరలేక వెలవెల పోతున్నాయని పలువురు అన్నదాతలు ఆందోళనవ్యక్తంచేస్తున్నారు. గడిచిన 10రోజుల నుండిసాగుభూములకుఅంతంతమాత్రంగా అందుతున్న పీబీసీ ఏలేరు నీటిజలాలు రైతులకు సరిపడాసాగునీరు విడుదల కాకపోవడంతో ఇప్పటికే ఎకరాకి 30000పైసల్కు పెట్టుబడులుతో సతమతమవుతున్న అన్నదాతకు సాగునీరు కొరతమరింత ఆందోళనకు గురిచేస్తుందని అన్నదాతలు వాపోతున్నారు. సిరిపొట్టదశలోఉన్న వరిపైరుకు సకాలంలో సాగునీరు కొరత కారణంగా పంట దిగుబడులు గణనీయంగా తగ్గిపోయి రైతుల పరిస్థితి అధ్వానంగా మారేప్రమాదాలు కనిపిస్తున్నాయన్నారు. గొల్లప్రోలు మండలంలో రైతులు ఇప్పటికే అప్పుల ఊబిలో చిక్కుకున్నామని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు పరిస్థితులు ఇలానే కొనసాగితే గొల్లప్రోలు మండలంలో దాల్వా సాగులోఉన్న3000 ఎకరాల వరిపంట పొలాలు ఎండిపోయి ఎందుకు పనికిరాకుండా పోతాయని అన్నదాతలు వాపోతున్నారు దీనిపై గొల్లప్రోలురైతులు సంబంధిత శాఖాపరమైనఅధికారులను పిఠాపురంనియోజకవర్గంప్రజాప్రతినిధులను రైతులు సక్రమంగా సాగునీటివిడుదలకుతగిన జాగ్రత్తలుతీసుకుని గొల్లప్రోలుమండల రైతులనుఆదుకోవాలని అన్నదాతలుడిమాండ్ చేస్తున్నారు..

## మార్చి 9వ తేదీ రెండవ శనివారం జాతీయ లోక్ అదాలత్

**– జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత**



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** మంగళవారం తూర్పు గోదావరి జిల్లా న్యాయస్థాన ఆవరణలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ గంధం సునీత మార్చి 9వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌కు సంబంధించి చర్చించేందుకు వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయా శాఖలలో లోక్ అదాలత్ నందు పరిష్కారం పొందదగిన సమస్యలను గుర్తించి ఆ జాబితాను జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు అందజేయాలని అన్నారు. లోక్ అదాలత్ నందు ఇరుపక్షల వారికి రాజీ కుదిర్చి ఇరువురికీ అంగీకార యోగ్యమైన పరిష్కారం పొందవచ్చని తెలిపారు. కావున సదరు అధికారులు వారి సంస్థలకు సంబంధించిన వివాదాలను పరిష్కరించుకొనేందుకు ఈ సదావకాశాన్ని వినియోగించు కోవాలన్నారు. ఈ సమావేశంలో మునిసిపల్, కార్మిక, విద్యుత్, టెలికాం, బ్యాంకింగ్, ఏ.పి. ఫైనాన్స్ కార్పొరేషన్ శాఖల అధికారులు, రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్, చిట్ ఫండ్స్ సంస్థల అధికారులు, పాల్గొన్నారు.

## 8న శ్రీ మరిడమ్మ అమ్మవారి హుండీల లెక్కింపు



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు ఈ నెల 8వ తేదిన ఉదయం 8 గంటలకు దేవదాయ ధర్మాదాయ శాఖాధికారుల సమక్షంలో హుండీల లెక్కింపు కార్యక్రమం నిర్వహించబడునని, దేవస్థాన అసిస్టెంట్ కమీషనర్ మరియు కార్యనిర్వాహణాధికారి సిహెచ్.రామ మోహనరావు తెలిపారు.

ఈ లెక్కింపు కార్యక్రమంలో దేవస్థాన ఛైర్మన్, అధికారులు పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు.

# జాతీయ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు శ్రీనివాస్



కాకినాడ, మేజర్ న్యూస్ : కాకినాడ ఆర్టీసి డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్న ఎం.శ్రీనివాసరావు ఈ నెల 6నుండి 8వరకు జరగనున్న జాతీయ వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో పాల్గొనేందుకు గోవాకు బయల్దేరి వెళ్ళారు. ఈ సందర్భంగా లయన్స్ ఎలైట్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. వెంకట్‌నగర్‌లోని మార్‌టెక్ ప్రధాన కార్యాలయంలో లయన్స్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ముంజులూరి విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో శ్రీనివాసరావు అభినందన కార్యక్రమాన్ని క్లబ్ అధ్యక్షులు ఎం.సుబ్రహ్మణ్యం నిర్వహించారు. విశ్వేశ్వరరావు మాట్లాడుతూ క్రీడాకారులకు సముచిత ప్రాధాన్యం ఇవ్వడానికి లయన్స్ ఎలైట్ క్లబ్ ఎల్లప్పుడు ముందుంటుందని అన్నారు. త్వరలో కాకినాడకు చెందిన జాతీయ అంతర్జాతీయ క్రీడాకారులు పురస్కార కార్యక్రమాన్ని నిర్వహించేందుకు నిర్ణయించామని చెప్పారు. కాకినాడ పేరును జాతీయ అంతర్జాతీయ స్థాయిలో నిలబెడుతున్న వెయిట్ లిఫ్టర్ శ్రీనివాసరావును అభినందిస్తూ స్వయం కృషితో రాణించడం ఆయన క్రమశిక్షణకు నిదర్శనమని అన్నారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ తన గోవా పర్యటన విజయవంతం అవ్వాలన్న ఆకాంక్షతో లయన్స్ సత్కరించడం ఆనందంగా ఉందని అన్నారు. ఇప్పటి వరకు తాను జాతీయ అంతర్జాతీయ స్థాయిలో 62 బంగారు పతకాలను సాధించానని చెప్పారు. గోవాలో జరిగే జాతీయ వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో కూడా తప్పక విజయం సాధిస్తాని తెలుపుతూ కృతజ్ఞతలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో గణేష్, సాగర్, రంగాభట్ల శ్రీనివాస్, పరశరామ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## 15వ డివిజన్‌లో జనసేన 'యువత భవిష్యత్ కోసం యుద్ధానికి మేము సిద్ధం' కార్యక్రమం



**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ సిటిలో జనసేనపార్టీ పి.ఏ.సి సభ్యులు మరియు కాకినాడ సిటి ఇంచార్జ్ ముత్తా శశిధర్ నాయకత్వంలో మత్స్యకార యువత భవిష్యత్ కోసం యుద్ధానికి మేము సిద్ధం అనే కార్యక్రమం మంగళవారం స్థానిక 15వ డివిజన్ ఏటిమొగ్గ ముల్లారమ్మ & ధనమ్మ గుడి ప్రాంతంలో బర్రె అప్పారావు ఆధ్వర్యంలో జరిగింది.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముత్తా శశిధర్ మాట్లాడుతూ లోగడ జూన్ 16వ తేదీన తన పర్యటనలో స్మార్ట్ ఏటిమొగ అనే నినాదంతో మా నాయకులు పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చిన సంగతి మీ అందరికీ తెలిసినదే అని దానిని తూచా తప్పకుండా అమలు చేసే బాధ్యత జనసేన పార్టీ తీసుకుంటుందన్నారు. మరి ఇక్కడ పరిశీలిస్తే 2022 సంవత్సరంలో స్మార్ట్ సిటీ నిధులతో తలపెట్టిన ఒక శంఖుస్థాపన చూస్తున్నామనీ ఒక గోడ కట్టి సుమారు యాభై లక్షల నిధులు అయిపోయాయన్నారనీ ఇలా విస్తుపోయే నిజాలు కనపడుతున్నాయనీ ఇది కేవలం ప్రజాధనాన్ని దోపిడీ చేయడమే అని అన్నారు. ఇక్కడ ఉన్న స్థానిక యువతకి ఉపాధి కల్పించాలంటూ డిమాండ్ చేసారు. పోర్టులో మత్స్యకార యువతకి ఉపాధి కల్పించే బాధ్యత జనసేనపార్టీ తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఒకనాడు ఇక్కడి పేదల ఇళ్ళకోసం నాటి శాసనసభ్యులు అయిన తన తండ్రి ముత్తా గోపాలక్రిష్ణ సాల్ట్ కమీషన్ వారి భూమిని తీసుకుని నివాసాలని ఏర్పాటు చేయడం జరిగిందనీ, వీరి అవసరం మేరకు మరల తీసుకుని తాము ఇక్కడి వారికి ఇక్కడే కాకినాడలోనే ఇళ్ళు ఇచ్చేదుకు తగిన చర్యలు తాము అధికారంలోకి వచ్చిన వెంటనే తీసుకుంటామన్నారు. రాబోయే నలభైరోజుల తరువాత జరిగే ఎన్నికలలో ఈ ముఖ్యమంత్రిని, వై.ఎస్.ఆర్ పార్టీని దించేందుకు మేము సిద్ధం అని స్థానికులతో కలిసి నినందించారు.ఈ కార్యక్రమంలో ఆదినారాయణ, పంతా సింహాద్రి, ఏ.తాతారావు, కర్రి సంతోష్, సాధనాల లోవరాజు, వాసంసెట్టి శ్రీను, వెంకటేష్, రాజశేఖర్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రామవరం జాతీయ రహదారిపై కంటైనర్ లారీలో తరలిస్తున్న 370 కేజీల గంజాయి స్వాధీనం..



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** మండలంలోని రామవరం జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న హర్యానా రాజస్థాన్ దాబా హొటల్ వద్ద ఒక కంటైనర్ లారీలో ప్రత్యేక అర ద్వారా అక్రమంగా తరలిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకుని, ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు జగ్గంపేట సీఐ లక్ష్మణరావు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి సీఐ లక్ష్మణరావు తెలిపిన వివరాల ప్రకారం హర్యానా కు చెందిన ఇబ్రహీం, జూన్డ్ అనే ఇద్దరు వ్యక్తులు ఒరిస్సా లోని చిత్రకొండ గ్రామంలో మోటూ అనే వ్యక్తి వద్ద 370 కేజీల గంజాయిని కొనుగోలు చేసి తరలిస్తుండగా వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు జగ్గంపేట సిఐ లక్ష్మణరావు తెలిపారు. అయితే మోటు అనే వ్యక్తి ఈ యొక్క గంజాయిని ముందు రోజు గండేపల్లి మండలం మురారి గ్రామంలోని పోలవరం కెనాల్ వద్ద తీసుకువచ్చి తుప్పల్లో దాచి ఇద్దరు వ్యక్తులకు సరుకు అప్పగించడం జరిగిందని అదే రోజు ఇబ్రహీం, జూన్డ్ లు మహారాష్ట్రకు చెందినటువంటి సీక్రెట్ అరతో కూడి ఉన్న కంటైనర్ లారీలో ఈ యొక్క గంజాయిని నింపుకొని తరలిస్తుండగా మార్గం మధ్యలో లారీ మరమ్మతులకు గురవడంతో రామవరం హర్యానా రాజస్థాన్ దాబా వద్ద లారీకి రిపేరు చేస్తుండగా అందులో గంజాయి తరలిస్తున్నట్లు జగ్గంపేట పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు జగ్గంపేట ఎస్సై నాగార్జున రాజు సిబ్బందితో దాడులు నిర్వహించడం జరిగిందని సీఐ తెలిపారు.ఈ ఘటనలో ఇబ్రహీం, జూన్డ్ ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి సుమారు 7 లక్షల 50వేల రూపాయలు విలువగల 370 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. అదేవిధంగా గంజాయి తరలిస్తున్న కంటైనర్ లారీ ,మూడు సెల్ ఫోన్లు,1500 రూపాయల నగదు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. వీరిని కోర్టులో హాజరు పరచగా గౌరవ మెజిస్ట్రేట్ వారు రిమాండ్ విధించినట్లు తెలిపారు.ఈ కేసుకు సంబంధించి గంజాయి సరఫరా చేసిన మోటో అనే వ్యక్తి పరారీలో ఉన్నాడని త్వరలో అతన్ని అరెస్టు చేయడం జరుగుతుందని సీఐ లక్ష్మణరావు తెలిపారు.

# అలంబండ దాడితో మహిళకు తీవ్రగాయాలు

**– కాకినాడప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స**



**గొల్లప్రోలు, మేజర్ న్యూస్ :** దట్టమైన అడవుల్లో కొండల్లో సంచరించే క్రూరమృగాలు ప్రమాదకరమైన కోతిజాతికి చెందిన అలంబండలు ఇటీవల జనవాసాల మధ్య పల్లెలు పట్నాలు తేడా లేకుండా ఆహారంకోసం గుంపులుగుంపులుగా తిరుగుతూ వాటి ప్రాణరక్షణకు ప్రజలపై దాడులు చేసిన ఘటనలు చూస్తూనే ఉన్నాము. వివరాల్లోకి వెళితే గొల్లప్రోలు మండలం చేబ్రోలులో కర్రి వారి వీధికి చెందిన చేదులూరి సత్యవేణిపై మంగళవారం ఉదయం అలంబండదాడి చేయటంతో కృష్ణవేణి చేతికి తీవ్రగాయం కావడంతో స్థానికులు భయబ్రాంతులకు గురికావడంతో విషయం కాకినాడఎంపీవంగాగీత దృష్టికిగొల్లప్రోలు జడ్పిటిసి ఉలవకాయల నాగలోవరాజు తీసుకు వెళ్లడంతో తక్షణం స్పందించిన పిఠాపురం వైఎస్ఆర్ పార్టీ ఇంచార్జ్ ప్రస్తుతం ఎంపీ గీత జిల్లాఫారెస్ట్ అధికారులను అప్రమత్తం చేశారు. ఎంపీ గీత అలంబండను పట్టుకుని బాధితురాలు కృష్ణవేణికి న్యాయం చేయాలని ఫారెస్ట్ అధికారులను ఎంపీ ఆదేశించారు. బావురువాక ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బాబురావు ఎస్అగ్రహారం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పి లావణ్య పంచాయతీకార్యదర్శి శ్రీనివాస్ ఉప సర్పంచ్ ఓరుగంటి సూర్యకుమారి చక్రి గొల్లప్రోలు జడ్పిటిసి మిత్రమండలి సభ్యులు వైయస్సార్ పార్టీ కార్యకర్తలు ఎంపీటీసీ లు జడ్పిటిసితో కలిసి బాధ్యత కుటుంబాన్ని పరామర్శించి ఇలాంటి సంఘటనలు అరుదుగా జరుగుతాయని కాస్త ధైర్యంగా ఉండాలని జడ్పిటిసి కుటుంబ సభ్యులను ఓదార్చారు అనంతరం ఫారెస్ట్ అధికారులు సిబ్బంది అలంబండను పట్టుకునేందుకు తీవ్ర గాలింపుచర్యలుచేబ్రోలులో ప్రారంభించారు.